www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:19 FRIDAY ,MAY 29,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 19 శుక్రవారం 29 మే 2026 పేజీలు :8 వెల: 4/-

# దేశవ్యాప్తంగా ఘనంగా బక్రీద్ వేడుకలు..



- తెలంగాణ అంతటా ఈద్-ఉల్-అధా సందడి..
- ప్రార్థనలు..ఖుర్బానీలు.. సేవాభావంతో వెల్లివిరిసిన పండుగ శోభ..

# ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి...
## కార్యక్రమానికి హాజరైన నందమూరి కుటుంబ సభ్యులు

- అమీర్‌పేట మైత్రివనం వద్ద విగ్రహావిష్కరణ
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, నందమూరి కుటుంబ సభ్యులు, మంచు మనోజ్
- కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్న రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల హామీని నెరవేరుస్తున్న సీఎం



మే 28 ( హంస కలం )

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, నందమూరి కుటుంబ సభ్యులు, నటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్నారు. అన్న ఎన్టీఆర్ లేకుంటే మీరు నాయకుడు అయ్యారా అని నిలదీశారు. అన్న నీడన బతికిన మీరు ఆయన గురించి తక్కువ చేసి మాట్లాడటమేమిటని - మిగతా2లో

# కర్ణాటక సర్కార్‌లో కీలక పరిణామం... సీఎం కుర్చీ దిగిన సిద్ధరామయ్య..

మే 28 ( హంస కలం )

కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లి.. తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. అయితే ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో.. - మిగతా2లో



# హోర్ముజ్‌లో మందుపాతరల వేట.. ప్రత్యేక నౌకను పంపిన బ్రిటన్..

మే 28 ( హంస కలం )

ఇరాన్ యుద్ధంలో తాము ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడానికి ఇష్టపడటం లేదని చెబుతున్న బ్రిటన్, హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా మార్చేందుకు మాత్రం సిద్ధమవుతోంది. హోర్ముజ్ జలసంధి లోని ఇరాన్ అమర్చిన మందుపాతరలను గుర్తించి, తొలగించడంలో సహాయపడటానికి ముందుకొచ్చింది. హోర్ముజ్ జలసంధికి ఒక ప్రత్యేక సైనిక నౌకను పంపింది. బ్రిటన్ - మిగతా2లో



# బీజేపీలో కీలక మార్పులు..
## నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు




మే 28 ( హంస కలం )

భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం పలు రాష్ట్రాల్లో పార్టీ నాయకత్వంలో కీలక మార్పులు చేసింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, త్రిపుర రాష్ట్రాలకు కొత్త పార్టీ అధ్యక్షులను నియమిస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ కార్యదర్శి - మిగతా2లో

# మహాలక్ష్మికి స్మార్ట్ కార్డులు..




మే 28 ( హంస కలం )

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడానికి, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ప్రభుత్వ ప్రత్యేకంగా మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల జారీ చేయనున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీలో విద్యార్థులకు రాయితీ, ఉద్యోగులకు, ఇతరులకు నెలవారీగా సీజన్ పాస్ అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో మహాలక్ష్మిలకు స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. - మిగతా2లో

# ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి కోమటి రెడ్డి



మే 28 ( హంస కలం )

బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అల్లా పట్ల ఉన్న అపారమైన విశ్వాసాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదని వ్యాఖ్యానించారు. నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో ముస్లిం సోదరులను కలిసి - మిగతా2లో

# సింగరేణి, ఆర్టీసీ కార్మికులను ఈ ప్రభుత్వం ఘోరంగా మోసం చేస్తోంది

మే 28 ( హంస కలం )

తెలంగాణ వర్గాల గతి మార్చే అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అది తెలంగాణలో విప్లవాత్మక మార్పులు తెస్తుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ తో పాటు ఆయన అనుచరులు టీఆర్ఎస్‌లో చేరారు. గురువారం - మిగతా2లో



# హైదరాబాద్ టెక్కీ ఇంట్లో దొంగతనం.. ఫిర్యాదు చేసిన టెక్కీపైనే సొసైటీ పెద్దల ఫైర్!

మే 28 ( హంస కలం )

హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హౌసింగ్ సొసైటీలో ఓ టెక్కీకి విచిత్రమైన అనుభవం ఎదురైంది. తన ఇంట్లో దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేస్తే, దానికి పరిష్కారం చూపాల్సింది పోయి, తనపైనే సొసైటీ నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే, - మిగతా2లో



# దేశవ్యాప్తంగా ఘనంగా బక్రీద్ వేడుకలు..

-మొదటిపేజీ తరువాయి

పవిత్ర ఈద్-ఉల్-అధా (బక్రీద్) పండుగను గురువారం దేశవ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. త్యాగం, విశ్వాసం, సోదరభావానికి ప్రతీకగా భావించే ఈ మహా పండుగ సందర్భంగా దేశంలోని మసీదులు, ఈద్గాహ్‌లు ప్రార్థనలతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే ముస్లిం సోదరులు కొత్త దుస్తులు ధరించి ప్రత్యేక నమాజుల్లో పాల్గొని దేశ శాంతి, ప్రజల సుఖసంతోషాలు, సామరస్య వాతావరణం కోసం ప్రార్థనలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కూడా బక్రీద్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈద్గాహ్‌లు భక్తులతో కిక్కిరిశాయి. చార్మినార్ పరిసర ప్రాంతాలు, మక్కా మసీదు, మిరాలం ఈద్గాహ్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, టోలిచౌకి, మలక్‌పేట్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో వేలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈద్-ఉల్-అధా సందర్భంగా ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ ఖుర్బానీలు నిర్వహించారు. అల్లాహ్ ఆజ్ఞకు లోబడిన ప్రవక్త ఇబ్రాహీం చేసిన మహా త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ ముస్లిం కుటుంబాలు భక్తిశ్రద్ధలతో ఖుర్బానీ ఆచారాలను పాటించాయి. అనంతరం ఖుర్బానీ మాంసాన్ని పేదలకు, బంధుమిత్రులకు పంచిపెట్టి సేవాభావాన్ని చాటుకున్నారు. పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మసీదులు విద్యుత్ దీపాలతో అలంకరించబడగా, మార్కెట్లు రద్దీగా మారాయి. చిన్నారులు కొత్త దుస్తుల్లో సందడి చేయగా, కుటుంబ సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక వంటకాలతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. బిర్యానీ, షీర్ ఖుర్మా వంటి ప్రత్యేక వంటకాలతో ముస్లిం కుటుంబాలు అతిథులను ఆతిథ్యం పలికాయి. బక్రీద్ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, మంత్రులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సమాజంలో ప్రేమ, శాంతి, ఐక్యత, దాతృత్వ భావాలను పెంపొందించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పండుగ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఈద్గాహ్‌ల వద్ద తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత వంటి సౌకర్యాలను కల్పించింది. దేశంలో పెరుగుతున్న విభేదాల మధ్య ఈద్-ఉల్-అధా మానవత్వం, త్యాగం, సహనానికి ప్రతీకగా నిలుస్తోందని మత పెద్దలు పేర్కొన్నారు. పేదల పట్ల ప్రేమ, అవసరమైన వారికి సహాయం చేయడం, సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం ఈ పండుగ అసలు ఉద్దేశమని వివరించారు. భక్తి, ఆనందం, సేవా భావం కలగలిసిన బక్రీద్ వేడుకలు దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకొచ్చాయి. త్యాగమే గొప్ప ధర్మమని చాటి చెప్పే ఈద్-ఉల్-అధా మరోసారి మానవతా విలువలను ప్రపంచానికి గుర్తు చేసింది..

## కర్ణాటక సర్కార్‌లో కీలక పరిణామం... సీఎం కుర్చీ దిగిన సిద్ధరామయ్య..

-మొదటిపేజీ తరువాయి

ఆయన కార్యదర్శికి లేఖ అందజేశారు సిద్ధరామయ్య. గవర్నర్ బెంగళూరుకు తిరిగి వచ్చిన తర్వాత రాజీనామాపై అధికారిక నిర్ణయం తీసుకోనున్నట్లు లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. రాజీనామా అనంతరం మీడియాతో మాట్లాడిన సిద్ధరామయ్య.. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ ఐక్యత దృష్ట్యా పదవి నుంచి తప్పుకుంటున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అసెంబ్లీలో స్పష్టమైన మెజార్టీ ఉందని.. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. ముఖ్యమంత్రిగా తనకు సహకరించిన ప్రజలు, పార్టీ నాయకులు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ఎంపీ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు సిద్ధరామయ్య. తన రాజకీయ జీవితాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయాల్లోకి రావడం యాదృచ్ఛికమని, తమ కుటుంబంలో ఇంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరని అన్నారు. 2006లో కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పార్టీ తనకు ఎన్నో అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా రెండు సార్లు, ప్రతిపక్ష నేతగా రెండు సార్లు పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తన ప్రభుత్వ పనితీరుపై మాట్లాడిన సిద్ధరామయ్య... ఎన్నికల హామీల్లో ఎక్కువ భాగం అమలు చేశామని పేర్కొన్నారు. తొలి ఏడాదిలోనే ఐదు గ్యారంటీ పథకాలను ప్రారంభించామని తెలిపారు. ప్రతిపక్షాలు అనేక ఆరోపణలు చేసినప్పటికీ ప్రజల కోసం పని చేయడంలో వెనుకడుగు వేయలేదని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం భవిష్యత్తులో ఏ బాధ్యత అప్పగించినా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు.

# మహాలక్ష్మికి స్మార్ట్ కార్డులు..

-మొదటిపేజీ తరువాయి

స్మార్ట్ కార్డులు వచ్చే నెల 2వ తేదీ నుంచి అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బడ్జెట్ సన్నాహక సమావేశం లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎం.డి.నాగిరెడ్డి ఈ విషయమై సమీక్షించారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధుల కేటాయింపు ప్రతిపాదలను ఆర్థిక శాఖ మంత్రికి ఎం.డి. నాగిరెడ్డి వివరించడంతోపాటు స్మార్ట్ కార్డుల జారీకి సంబంధించిన వ్యయం గురించి వివరించారు. ఇందుకు ఆమోదం తెలుపడంతో తొలుత జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని, సాంకేతిక సమస్యలు పరిష్కరించుకొని జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై కసరత్తు జరుగుతోంది. స్మార్ట్ కార్డుకు సంబంధించిన విధివిధానాలు ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని అధికారులకు ఇంకా అందలేదు. త్వరలో సమాచారం అందే అవ కాశం ఉన్నట్టు చెబుతున్నారు.

**ఏటీఎం తరహాలో కార్డు**

ఏటీఎం తరహాలో చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డు జారీ చేస్తారు. ముందుగా ఆధార్ కార్డు, ఒక ఫొటో సేకరించి మహాలక్ష్మల ప్రాథమిక సమాచారం చిప్‌తో అనుసంధానిస్తారు. ఈ స్మార్ట్ కార్డులో లబ్ధిదారుడి పూర్తి వివరాలు, ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటాయి. తర్వాత వారి పేర్లతో కార్డు జారీ చేస్తారు. అమల్లోకి వచ్చాక స్మార్ట్‌కార్డు చూపకుంటే ఉచిత ప్రయాణానికి అనుమతివ్వరు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల పరిధిలో నెలకు సగటున 1.12కోట్ల మంది, ఏడాదికి 13.33 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు.

**దుర్వినియోగానికి చెక్**

ఇతర రాష్ట్రాల వారు నకిలీ ఆధార్ కార్డులతో ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. బతుకు తెరువు కోసం పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన వేలాది మహిళా కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, నకిలీ ఆధార్ కార్డుల సాయంతో బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. దీని వల్ల ఆర్టీసీకి పెద్ద మొత్తంలో ఆదాయానికి గండి పడుతోంది. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. కార్డుల జారీ దరఖాస్తు చేసుకునే విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవడానికి, సమీప కార్డుల జారీ కేంద్రాన్ని కనుగొనడానికి టీఆర్ఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి సమారాన్ని త్వరలో పొందుపరుస్తారు. కార్డులు అందే వరకు ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

## ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి కోమటిరెడ్డి

-మొదటిపేజీ తరువాయి

బక్రీద్ కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదని... ఇది మానవాళికి ఒక గొప్ప జీవన సందేశమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాలకు అతీతంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 'భారత్ జోడో' యాత్ర చేపట్టారని ప్రస్తావించారు. అన్నివర్గాలు, అన్నిమతాల ప్రజలు సమానమేనని, అందరు కలిసి మెలిసి ఉండాలనే గొప్ప సందేశంతో 'భారత్ జోడో' యాత్ర చేశారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అనడానికి ఇది ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. నల్గొండలో మతసామరస్యానికి, గంగా - జమునా - తెహజీబ్‌కు నిలువెత్తు సాక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్ టెక్కీ ఇంట్లో దొంగతనం.. ఫిర్యాదు చేసిన టెక్కీపైనే సొసైటీ పెద్దల ఫైర్!

-మొదటిపేజీ తరువాయి

దీనిపై ఆయన రెసిడెంట్స్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేసి, దర్యాప్తు కోసం సీసీటీవీ ఫుటేజ్ కావాలని కోరారు. అయితే, అప్పుడే ఆసక్తికర విషయం బయటపడింది. సొసైటీలోని సెక్యూరిటీ కెమెరాలు పనిచేయడం లేదని, ఈ విషయం తమకు కూడా ఇప్పుడే తెలిసిందని మేనేజర్ సమాధానమిచ్చారు. దీంతో అప్రమత్తమైన శ్రవణ్, భద్రతా లోపం గురించి నివాసితులను హెచ్చరిస్తూ, రక్షణ కోసం సొంతంగా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రూప్‌లో సూచించారు. ఇది జరిగిన మరుసటి రోజే సొసైటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు అతడిని క్లబ్‌హౌస్‌కు పిలిపించారు. దొంగతనం గురించి చర్చించకుండా, "సొసైటీ పరువు తీస్తున్నావ్, అందరి స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నావ్" అంటూ తనపై గట్టిగా అరిచారని శ్రవణ్ ఆరోపించారు. ఈ క్రమంలో ఉపాధ్యక్షుడు, "ఈరోజు ఖరీదైన చెప్పులు పోయాయంటారు, రేపు అండర్‌వేర్ పోయిందంటారు. వాటన్నిటికీ మేం బాధ్యత తీసుకోలేం" అని నిర్లక్ష్యంగా వ్యాఖ్యానించినట్లు శ్రవణ్ తెలిపారు. వారి ప్రవర్తనతో విసిగిపోయిన ఆయన, వాట్సాప్ గ్రూప్ నుంచి బయటకు వచ్చి తన అనుభవాన్ని 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ పోస్ట్ వైరల్ అవ్వడంతో, ముంబై వంటి నగరాల్లోని అనేక మంది తాము కూడా ఇలాంటి ఇబ్బందులనే ఎదుర్కొంటున్నామని కామెంట్లు పెడుతున్నారు.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి... కార్యక్రమానికి హాజరైన నందమూరి కుటుంబ సభ్యులు

-మొదటిపేజీ తరువాయి

రామారావు పేరు పెట్టుకున్న నకిలీలు కూడా కూడా ఈరోజు నాయకుడిగా చెలామణి అవుతున్నారని వ్యాఖ్యానించారు.ఎన్టీఆర్ అవకాశమిచ్చి, ప్రోత్సాహమిచ్చిన వారిలో తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, జానారెడ్డి, దేవేందర్ గౌడ్, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు కేసీఆర్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయ అవకాశం కల్పించిందే ఎన్టీఆర్ అన్నారు. ఈ చరిత్రను ఎవరూ మరువరాదని రేవంత్ రెడ్డి అన్నారు.

## హోర్ముజ్‌లో మందుపాతరల వేట.. ప్రత్యేక నౌకను పంపిన బ్రిటన్..

-మొదటిపేజీ తరువాయి

రాయల్ నేవీకి చెందిన ఆర్ఎఫ్ఏ లైమ్ బే నౌక సహాయంతో హోర్ముజ్‌లోని సీ-మైన్స్‌ను తొలగించే ఆపరేషన్ మొదలుకాబోతోంది. ఈ నౌకను మైన్-హంటింగ్ డ్రోన్లు, అండర్‌వాటర్ సెన్సర్లు, క్లియరెన్స్ బృందాలతో అప్‌గ్రేడ్ చేసి హోర్ముజ్ వైపు పంపించారు. ఈ నౌక ప్రస్తుతం జిబ్రాల్టర్ నుంచి బయలుదేరి సూయజ్ కాలువ ద్వారా పర్షియన్ గల్ఫ్ వైపు ప్రయాణిస్తోంది. సోనార్, ధ్వని, అయస్కాంత సెన్సార్లను ఉపయోగించి మందుపాతరలను గుర్తించే సామర్థ్యం గల వ్యవస్థలను ఈ నౌక మోసుకెళ్తోంది. ఇరాన్ నుంచి దాడులను ఎదుర్కొంటున్న పశ్చిమాసియా దేశాలకు బ్రిటన్ ఇప్పటికే యుద్ధ విమానాలను, డ్రోన్ నిరోధక వ్యవస్థలను అందించింది. కాగా, వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత, వాణిజ్య నౌకలను రక్షించడం, హోర్ముజ్ జలసంధి నుంచి పేలుడు పదార్థాలను తొలగించడం లక్ష్యంగా ఒక పూర్తి రక్షణాత్మక కార్యక్రమానికి తాము సంయుక్తంగా నాయకత్వం వహిస్తామని యూకే, ఫ్రాన్స్ ఏప్రిల్‌లో ప్రకటించాయి.

## బీజేపీలో కీలక మార్పులు.. నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు

-మొదటిపేజీ తరువాయి

అరుణ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. తాజా మార్పుల ప్రకారం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాకు ఢిల్లీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. వీరేంద్ర సచ్‌దేవా స్థానంలో ఆయన ఈ పదవిని చేపట్టనున్నారు. హర్యానా బీజేపీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ అర్చనా గుప్తాను, పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సర్దార్ కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, త్రిపుర సారథిగా డాక్టర్ అభిషేక్ దేబ్రాయ్‌ను నియమించారు. నితిన్ నబిన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీలో జరిగిన తొలి పెద్ద పునర్వ్యవస్థీకరణ ఇదే కావడం గమనార్హం. ఈ నియామకాల్లో పంజాబ్ అధ్యక్షుడి ఎంపికకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్పు కీలకంగా మారింది. ప్రస్తుతం ఆప్ పాలనలో ఉన్న పంజాబ్‌లో కాంగ్రెస్ నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ రాజకీయ అవకాశాన్ని అందిపుచ్చుకుని కీలక శక్తిగా ఎదగాలని బీజేపీ భావిస్తోంది. వీరి నేతృత్వంలో రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో కొత్త కార్యవర్గాల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

## సింగరేణి, ఆర్టీసీ కార్మికులను ఈ ప్రభుత్వం ఘోరంగా మోసం చేస్తోంది

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయంలో వారికి కండువాలు కప్పి టీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న బోడ జనార్దన్ చేరికతో టీఆర్ఎస్ కు మరింత బలం చేకూరిందన్నారు. చిన్న వయసులోనే కార్మిక శాఖ మంత్రిగా, ఆర్టీసీ ఛైర్మన్ గా పనిచేసిన జనార్ధన్ సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన హోదాకు తగిన విధంగా పార్టీలో ప్రాధాన్యం ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి, ఆర్టీసీ కార్మికులకు అన్యాయం చేస్తూ కర్కషంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించేందుకు ఏర్పడిందే తెలంగాణ రక్షణ సేన అని కవిత అన్నారు. సబ్బండ తెలంగాణ వర్గాల గతి మార్చే అభివృద్ధి ప్రణాళికను తయారు చేస్తున్నామని త్వరలోనే ఆ ప్రణాళికను ప్రకటిస్తామని చెప్పారు. ఇందుకోసం చాలా సీరియస్‌గా కసరత్తు చేస్తున్నామన్నారు. తాము తీసుకురాబోయే ప్రణాళిక తెలంగాణ లో విప్లవాత్మక మార్పులు తెస్తుందని కవిత చెప్పారు. తమ పార్టీ సమ సమాజ స్థాపన కోసం ఏర్పడిందని తాము కచ్చితంగా తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా మారుతామన్నారు. ప్రశ్నించటం, పోరాటడటం, పరిష్కరిం చటం అనే విధానంతో తాము ముందుకు వెళ్తున్నామని కవిత చెప్పారు. కొంతమంది ప్రశ్నిస్తారు. మరికొంతమంది పోరాటం చేస్తారు. కానీ తమ పార్టీ ప్రశ్నించి, పోరాడి, పరిష్కరించే వరకు సమస్యను వదిలిపెట్టదన్నారు. జనం బాట కార్యక్రమం లో మనం ప్రస్తావించిన సమస్యల్లో 25 సమస్యలకు పరిష్కారం లభించిదని గుర్తు చేశారు.. నల్గొండలో 35 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న బ్రిడ్జి పనులను జనంబాటలో ప్రస్తావిస్తే...ఇప్పుడు ఆ బ్రిడ్జి పనులను ప్రారంభించారని కవిత గుర్తు చేశారు.


# సంపాదకీయం


## అయోడైజ్డ్ ఉప్పు--ఆంధ్రుడి అన్వేషణ

మనం ఇప్పుడు సర్వసాధారణంగా వాడే అయోడైజ్డ్ ఉప్పు (Iodised Salt) వెనుక ఉన్న మేధస్సు డాక్టర్ ఉలిమిరి రామలింగస్వామిది. ఒకప్పుడు భారతదేశాన్ని కుదిపేసిన సమస్య గొంతువాపు వ్యాధి (Goitre). అప్పట్లో దేశంలో ఈ వ్యాధి వ్యాప్తి 30శాతానికి మించిపోయింది. కానీ ఈ మధ్య ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి సర్వేల ప్రకారం గాయిటర్ రేటు 5శాతం కంటే తక్కువకు పడిపోయింది. దీనికి కారణమైన మహానుభావుడు ఉలిమిరి రామలింగస్వామి. సరిగ్గా పాతికేళ్ళక్రితం కన్నుమూసిన ఆయన వర్ధంతి నేడు. రామలింగస్వామి శ్రీకాకుళంలో 1921 ఆగస్టు 8న జన్మించారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ నుండి 1944లో ఎంబీబీఎస్, 1946లో ఎండీ పట్టాలను పొందారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి స్కాలర్‌షిప్ ద్వారా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ, డాక్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీలను సాధించారు. భారతదేశానికి తిరిగి వచ్చి, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్‌లో పేథాలజిస్ట్‌గా 1954 దాకా పనిచేస్తూ, డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. 1954లో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో ప్రవేశించి, పేథాలజీ ప్రొఫెసర్‌గా, డైరెక్టర్‌గా ఒక దశాబ్దకాలం (1969--1979) వ్యవహరించారు. హార్వార్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ విజిటింగ్ ప్రొఫసర్‌గా, ఎయిమ్స్‌లో ప్రొఫెసర్ ఎమెరిటస్‌గా కూడా రాణించారు. రోగుల పాలిట శాపంగా మారిన థైరాయిడ్ సంబంధిత సమస్యల గుట్టురట్టు చేయాలని సంకల్పించి, ఎయిమ్స్ సహకారంతో ఎందరో పేషంట్లతో మాట్లాడి, రమారమి లక్షమంది రోగులను పరిశీలించేరు. 1956 నుండి 1972 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో ఆయన చేసిన అధ్యయనం చాలా ముఖ్యమైనది. ప్రజలు వాడే సాధారణ ఉప్పులో అత్యల్ప మోతాదులో పొటాషియం అయోడేట్ (అయోడిన్) కలిపి పంపిణీ చేశారు. కొద్దిరోజుల్లోనే ఆ ప్రాంతంలో వ్యాధి తీవ్రత బాగా తగ్గిపోయింది. ఈ ప్రయోగమే నేడు భారతదేశంలో వాడుతున్న 'అయోడైజ్డ్ ఉప్పు' వెనుక ఉన్న రహస్యం. అక్కడ నుండి ఇంకా లోతైన పరిశోధన కోసం నీలగిరి ప్రాంతానికి వెళ్లి అక్కడ న్యూట్రిషన్ రీసెర్చ్ లేబరేటరీలో పరిశోధనలు చేసారు. థైరాయిడ్ సమస్యకి కారణం అయోడిన్ లోపం అని గుర్తించిన ఆయన 'గొంతువాపు వ్యాధి సమస్యను మనం నిత్యం వాడే సాధారణ ఉప్పులో అయోడిన్‌ను చేర్చడం ద్వారా సులభంగా పరిష్కరించవచ్చు'నని ప్రకటించారు. మనం రోజూ వాడే సాధారణ ఉప్పులో (సోడియం క్లోరైడ్) పొటాషియం అయోడేట్ కలపడం ద్వారా గొంతువాపు వ్యాధిని నివారించవచ్చని నిరూపించారు. ఈ పరిశోధన ఫలితంగానే భారతదేశంలో నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ కంట్రోల్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. ఫలితంగా ఇప్పుడు మనం వాడుతున్న 'అయోడైజ్డ్ ఉప్పు' అందుబాటులోకి వచ్చింది. థైరాయిడ్ వ్యాధులు గణనీయంగా తగ్గాయి. ఇది వైద్య చరిత్రలోనే ఒక మైలురాయి. పోషకాహార లోపం వల్ల పిల్లల్లో వచ్చే వ్యాధులపై ఆయన విస్తృత పరిశోధనలు చేశారు. గర్భిణీ స్త్రీలలో రక్తహీనతను తగ్గించడానికి ఐరన్ సప్లిమెంట్స్ అందించే జాతీయ కార్యక్రమాలకు ఆయన పరిశోధనలే పునాది. మధ్య ఆఫ్రికా దేశాల కంటే దక్షిణాసియా (భారతదేశం వంటి) దేశాలలో పిల్లల్లో పోషకాహార లోపం ఎందుకు ఎక్కువగా ఉందో వివరిస్తూ, 1996లో యునిసెఫ్ కోసం ఆయన రాసిన ప్రసిద్ధ నివేదిక 'ది ఏషియన్ ఎనిగ్మా'లో ఇలా పేర్కొన్నారు: "దక్షిణాసియాలో కనిపించే విపరీతమైన పోషకాహార లోపానికి ప్రధాన కారణాలు... పురుషులు, స్త్రీల మధ్య సమాజంలో ఉన్న తీవ్రమైన లింగ అసమానతలలోనే లోతుగా నాటుకుపోయి ఉన్నాయి." విటమిన్--ఎ లోపంపై రామలింగస్వామి గర్భవతులుగా ఉన్న కోతులపై పరిశోధన చేశారు. తల్లి కోతికి విటమిన్--ఎ లోపం ఏర్పడినప్పుడు, పుట్టబోయే పిల్ల కోతి కంటిలోని 'రాడ్స్ అండ్ కోన్స్' (వెలుతురును గుర్తించే కంటి భాగాలు) ఏ విధంగా దెబ్బతింటాయో ప్రయోగపూర్వకంగా నిరూపించారు. ప్రపంచ వైద్య చరిత్రలో ఈ విధమైన నష్టాన్ని కంటిచూపుతో సహా నిరూపించిన మొదటి శాస్త్రవేత్త ఆయనే. 1967లో బీహార్‌లో వచ్చిన ఘోరమైన కరవు సమయంలో, ఆహార కొరత లేకుండా ఏం చేయాలో సర్కారుకి ఈయనే సలహాలు ఇచ్చారు. 1984లో జరిగిన భోపాల్ గ్యాస్ దుర్ఘటన తర్వాత, అక్కడి బాధితులకు వైద్య సహాయం, పునరావాసం అందించే చర్యలను స్వయంగా ముందుండి నడిపించారు. 1994లో మహారాష్ట్ర, గుజరాత్‌లలో ప్లేగు వ్యాధి విజృంభించినప్పుడు ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసిన టెక్నికల్ అడ్వైజరీ కమిటీకి రామలింగస్వామి చైర్మన్. సమాజం నుండి, కొన్ని ప్రభుత్వ వర్గాల నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చినప్పటికీ, ఎయిడ్స్ వ్యాధి భారతదేశంలోకి కూడా చొచ్చుకొని వచ్చి మహమ్మారిగా మారే అవకాశముందని ముందే అంచనా వేసిన వ్యక్తి రామలింగస్వామి. ఆయన చొరవతోనే దేశవ్యాప్తంగా హెచ్.ఐ.వి టెస్టింగ్ కిట్లు, ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. భారతదేశంలో ఎయిడ్స్ నివారణ పరిశోధనలకు ఆయనే పునాది వేశారు. ఇన్ని పరిశోధనలతో వైద్యరంగంలోనే ఒక విప్లవాన్ని తీసుకొచ్చిన రామలింగస్వామి మే 28, 2001న క్యాన్సర్ బారినపడి మరణించారు. భారత వైద్యరంగానికి రామలింగస్వామి అందించిన సేవలు గుర్తిస్తూ భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్‌లతో సత్కరించింది. ఆయన గౌరవార్థం న్యూఢిల్లీలోని ×జవీ= ప్రధాన కార్యాలయానికి 'రామలింగస్వామి భవన్' అని పేరు పెట్టారు. ఒక అంతర్జాతీయ సదస్సులో ఒక విలేకరి రామలింగస్వామిని, "మీరు దశాబ్దాలుగా ఉప్పు మీదే ఎందుకు ఇంతగా రీసెర్చి చేస్తున్నారు?" అని అడిగితే, ఆయన నవ్వుతూ, "నేను భారతదేశంలో పుట్టాను, ఇక్కడి ఉప్పు తిని పెరిగాను. అందుకే 'ఉప్పు తిన్న విశ్వాసం' చూపిస్తూ, ఆ ఉప్పు రుణం తీర్చుకుంటున్నాను!" అని చమత్కరించారు.

# సంక్షోభం కాదు, ఇది 'సువర్ణా'వకాశం







ఇరాన్ యుద్ధం మహా అయితే కొన్ని వారాలపాటు జరుగుతుందని అనుకున్నాం. కానీ శాశ్వత పరిష్కారం కనుచూపులో కన్పించటం లేదు. ఈ విపత్కర పరిస్థితుల్లో మధ్యకాలిక, దీర్ఘకాల నియంత్రణ చర్యలపై దృష్టి సారించాలి. ఈ సంక్షోభం, రవాణాకు అంతరాయం ఇంకొన్ని వారాలు, నెలలు కొనసాగవచ్చు. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు మరిన్ని తలెత్తే అవకాశముంది. వాటికీ సిద్ధం కావాలి. మన తక్షణ సమస్య-- 2027 ఆర్థిక సంవత్సరానికి భారీ విదేశీ వాణిజ్య లోటును ఎదుర్కోవటం. ఇప్పటికే విదేశీ ద్రవ్య నిల్వలు హరించుకుపోతున్నాయి. చమురు, గ్యాస్ దిగుమతుల ఖర్చే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 230 బిలియన్ డాలర్ల దాకా అయ్యే అవకాశముంది. దీంతోపాటు, బంగారం పట్ల మోజు.. ఫారెక్స్ నిల్వల్ని ఖాళీ చేస్తోంది. గత మూడేళ్లలో 2,273 మెట్రిక్ టన్నుల పసిడిని దిగుమతి చేసుకున్నాం. ఇది ప్రపంచం మొత్తం బంగారం ఉత్పత్తిలో 25శాతం. ప్రస్తుత పసిడి ధరల ప్రకారం, గత మూడేళ్ల దిగుమతుల విలువ 336 బిలియన్ డాలర్లు. 'సంక్షోభం-- వృధా చేసుకోకూడని గొప్ప అవకాశం' అంటారు ఆర్థిక శాస్త్ర నోబెల్ గ్రహీత పాల్ రోమర్. ప్రస్తుత సంక్షోభాన్ని మనం అవకాశంగా మలచుకోవాలి. ఈ నేపథ్యంలో.. బంగారం విషయంలో అందరికీ లాభ దాయకమైన పరిష్కారాన్ని ప్రతిపాదిస్తున్నాను. భారత్‌లో బంగారం ఉత్పత్తి నామమాత్రంగానీ.. దిగుమతులు, నిల్వలు మాత్రం ప్రపంచంలోనే అత్యధికం. ఇందులో చాలావరకు ప్రయివేటు వ్యక్తుల వద్ద ఉన్నాయి. రోమన్ సామ్రాజ్యం కాలం నుంచి ఈ సంస్కృతి మన సమాజంలో భాగమైంది. మన దేశం విలాస సరుకుల్ని రోమ్‌కి భారీగా ఎగుమతి చేసేది. సుగంధ ద్రవ్యాలు, ముత్యాలు, ఏనుగు దంతాలు, నాజూకు వస్త్రాలు వంటివి. రుతుపవన ఆధారిత వాణిజ్య మార్గాలను ఇందుకు వినియోగించుకునేది. ఈ ఎగుమతుల నుంచి మనకు భారీ వాణిజ్య మిగులు లభించేది. ప్రతిగా బంగారం, వెండి, వజ్రవైఢూర్యాలు వంటివి పెద్దమొత్తంలో భారత్ దిగుమతి చేసుకునేది. ఈ వాణిజ్యంపై రోమ్‌లో ఆనాటి సుప్రసిద్ధ రచయిత, సేనానాయకుడు ప్లైనీ ది ఎల్డర్ (క్రీ.పూ 23--79) పెద్ద ఫిర్యాదే చేశారు. రోమన్లకు విలాస వస్తువుల పట్ల మోజును ఆసరాగా చేసుకుని రోమ్ సామ్రాజ్యం నుంచి ఇండియా ప్రతి సంవత్సరం 100 మిలియన్ రోమన్ సిక్కాల (సెస్టర్లు అనే నాణేలు)ను కొల్లగొడుతోందని ఆక్షేపించారు. అలా దిగుమతులు మొదలైన కాలం నుంచి.. బంగారాన్ని దాచుకోవటం భారతీయ కుటుంబాలు, మత సంస్థలకు ఆనవాయితీగా మారింది. భారతీయుల వద్ద ఇప్పటికి 35--40వేల మెట్రిక్ టన్నుల పసిడి ఉందని అంచనా. మానవ జాతి చరిత్రలో వెలికితీసిన మొత్తం బంగారంలో ఇది సుమారు 20శాతం. భారత్‌లో ఉన్న ఈ మొత్తం బంగారం విలువ ప్రస్తుత ధరల ప్రకారం 5 ట్రిలియన్ డాలర్లు. మన సాంస్కృతిక పరంపరలో బంగారు నగలు భాగమైనా, ఆ పసిడి మన దేశంలో నగల తయారీకి ఉపయోగపడటం లేదు. దీంతో విదేశాల నుంచి ఏటా భారీ మొత్తాల్లో దిగుమతి చేసు కోవాల్సి వస్తోంది. పోనీ, డబ్బు రూపంలోకి మార్చి సమాజానికో, కుటుంబానికో అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడే పెట్టుబడిగా మార్చు కోగలుగుతున్నామా అంటే-- అదీ లేదు. 98శాతం బంగారం ప్రజల వద్ద ఇళ్లలోనో, లాకర్లలోనో నిరుపయోగంగా ఉంది. రిజర్వు బ్యాంక్ వద్ద 880 మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉంటాయేమో. 2015లో ప్రవేశపెట్టిన గోల్డ్ మానిటైజేషన్ పథకం (జీఎంఎస్) కేవలం 37.81 మెట్రిక్ టన్నుల పసిడిని ఉత్పాదక అవసరాలకు మళ్లించింది. అదే ఏడాది తీసుకొచ్చిన సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) రూ.72,000 కోట్లను మాత్రమే బాండ్లుగా మార్చగలిగింది. సభ్యుల పెట్టుబడి బాండ్ల ద్వారా పోగైన మొత్తం బంగారం సుమారు 147 మెట్రిక్ టన్నులు. ఇప్పుడు బంగారం ధర చుక్కలు తాకటంతో.. ప్రభుత్వ ఖజానాపై ఆ మేరకు భారం పడుతుంది. ఎస్‌జీబీ హామీల్ని నెరవేర్చటానికి అంచనాలకు మించి ఎక్కువ మొత్తాల్ని నష్టపోవాల్సి ఉంటుంది. ఇంత సంక్షోభంలోనూ ఖరీదైన దిగుమతుల అవసరం లేకుండా, దేశీయ అవసరాలకు మన వద్దే నిరుపయోగంగా నిల్వవుంచిన బంగారాన్ని వినియోగించలేమా? దేశంలో మౌలిక వసతులను, మన ఉత్పాదక శక్తిని పెంచే ప్రయివేటు ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సమకూర్చుకోవటం కోసం భారీ బంగారం నిల్వల రూపంలో నిరుపయోగంగా ఉన్న ఈ పెట్టుబడిని ఉపయోగించలేమా? ఎస్‌జీబీలో రిస్క్ ఉన్నమాట వాస్తవం. బాండ్ కొనుగోలుదారులు నగదు చెల్లించి, వర్చువల్ (ఆన్‌లైన్) బంగారాన్ని కొనుగోలు చేస్తారు. బాండ్ విలువ మేరకు వడ్డీ అందుకుంటారు. గడువుతీరే సమయానికి బంగారానికి మార్కెట్‌లో ఎంత విలువ ఉంటే అంత మొత్తాన్నీ పొందే గ్యారంటీ ఉంటుంది. బాండ్‌ల ద్వారా కొనుగోలు చేసిన 147 మెట్రిక్ టన్నుల బంగారానికి ఇప్పటి మార్కెట్ రేటును చెల్లించాలంటే.. ప్రభుత్వం రూ.1,00,000 కోట్లు నష్టపోతుంది. కానీ, జీఎంఎస్ భిన్నమైనది. సరైనరీతిలో మెరుగుపరిస్తే జీఎంఎస్‌లో ప్రజలకు, ప్రభుత్వ ఖజానాకూ మంచి లాభావకాశాలున్నాయి. జీఎంఎస్‌లో తమ బంగారాన్ని యథాతథంగా (భౌతిక వస్తురూపంలో) ప్రజలు బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. సురక్షితమైన వడ్డీ ఖాతాను ప్రారంభిస్తారు. ఏటా కొద్దిమొత్తం వడ్డీని ఆర్జిస్తారు. గడువు తీరాక, డిపాజిటర్‌కి బంగారాన్ని డబ్బు రూపంలోనో బంగారు కడ్డీలు, నాణేల రూపంలోనో వడ్డీతో సహా చెల్లిస్తారు. ఇందులో బ్యాంకులకు రిస్క్ చాలా తక్కువ. డిపాజిట్ చేసిన బంగారాన్ని కొంతమేర డిమాండ్‌ను బట్టి దేశీయ మార్కెట్‌కి మళ్లించవచ్చు. దీనివల్ల పసుపు లోహాన్ని దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదు. విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోనక్కర్లేదు. ఈ పథకాన్ని గనక సులభతరం చేసి, డిపాజిట్‌దార్లకు తేలిగ్గా ఉండేలా ప్రక్రియను మారిస్తే.. బంగారాన్ని గణనీయ మొత్తంలో బ్యాంకులు ఆకర్షిస్తాయి. ప్రయివేటు పౌరులను, కుటుంబాలను దొంగ--పోలీస్ తరహా ప్రశ్నలు అడగకుండా; ఇళ్లలోని బంగారాన్ని వెల్లడించినందుకు పన్నులు విధించకుండా ఉంటేనే అది సాధ్యమవుతుంది. సంఘటిత నేర ముఠాలు అవినీతి సొమ్మును చెలామణిలోకి తెచ్చుకోకుండా జీఎంఎస్‌లో తగిన జాగ్రత్తలని తీసుకోవాలి. సరైన రీతిలో రూపకల్పన, అమలు చేస్తే.. ఇది మంచి ఫలితాలనిచ్చే అవకాశముంది. లావాదేవీలు సాధారణ బ్యాంకింగ్ కలాపాల్లా జరుగుతాయి. వ్యక్తులు, కుటుంబాలు తాము పొదుపు చేసుకున్న డబ్బుని బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటాయి. అవసరం ఉన్నవారికి బ్యాంకులు ఆ డబ్బును రుణంగా వడ్డీకి ఇస్తాయి. డిపాజిట్ చేసిన వారు వడ్డీ పొందుతారు. అవసరమైనప్పుడు డిపాజిట్‌ను ఉపసంహరించుకుంటారు. బంగారాన్ని కూడా మనం అదే రీతిలో చెలామణి చేయవచ్చు. దీనివల్ల పసిడి దిగుమతి భారీగా తగ్గుతుంది. అంతకంటే ముఖ్యం, ఇతర దేశాలనో, ద్రవ్య సంస్థలనో దేబిరించాల్సిన అవసరం లేకుండా.. బంగారం రూపంలో నిరుపయోగంగా ఉన్న అపార పెట్టుబడిని వినియోగంలోకి తేవచ్చు. అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి అవసరమైన పెట్టుబడికి వినియోగించవచ్చు. డిపాజిట్ రూపంలోని బంగారాన్ని క్రమంగా దేశ వినియోగ అవసరాలకు మళ్లిస్తారు. ఒక దశాబ్దకాలం గడిచేసరికి, మన ఆర్థిక వ్యవస్థ ఇంకా పరిణతి చెందు తుంది. హరిత సాంకేతికతలు విస్తరిస్తాయి. ఇంధన దిగుమతుల మీద మనం ఆధా రపడటమూ తగ్గుతుంది. ఎగుమతులు పెరిగి వాణిజ్య మిగులు ఏర్పడుతుంది. అవసరమనుకుంటే, అప్పుడు అడపాదడపా కొంత బంగారం దిగుమతి మొదలుపెట్టవచ్చు. ఇప్పుడు ఓ పదేళ్ల పాటు పసిడి దిగుమతులకు విరామం అవసరం. 'భారతదేశం ఓడిపోతే గెలిచేదెవరు? భారత్ గెలిస్తే ఓడిపోయేదెవరు? అని ప్రధాని నెహ్రూ అన్నారు. ఇప్పుడు దేశం కోసం ఈ లక్ష్యాల్ని నెరవేర్చే సంకల్పాన్ని... ఆర్థిక, బ్యాంకింగ్, పన్నుల, బంగారం, వాణిజ్య రంగాలలో నిపుణులు, ఆభరణాల తయారీదారులు ప్రదర్శించాలి. కలసి కూర్చుని చర్చించాలి. చాలా జాగ్రత్తగా ఆలోచించి ఆకర్షణీయ పథకానికి రూపకల్పన చేయాలి. ఒక అభివృద్ధి చెందిన దేశమవటానికి గొప్ప అవకాశం అందుబాటులోకి వచ్చిన తరుణంలో...భారీ పెట్టుబడిని నిరుపయోగకరంగా దాచిపెట్టటం, బంగారం పట్ల అంతులేని మోజును ప్రదర్శించటం, పెట్టుబడి అవసరం విపరీతంగా ఉన్న సమయంలో 5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడిని బంగారం రూపంలో నిరుపయోగకరంగా వదిలేయడం తెలివైన పంథా కాదు.

# అనన్య ఆస్పత్రిలో కలకలం

-శస్త్రచికిత్స తర్వాత రోగి మృతి కలకలం..
-వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణలు..
-కడుపునొప్పి చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన..
-కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు..





కూకట్ పల్లి, మే 28 ( హంస కలం )

పెద్దపల్లి జిల్లా రామయ్యపల్లి గ్రామానికి చెందిన ఉమ్మల్ల మల్లయ్య (55) అనుమానాస్పద మృతి కుటుంబ సభ్యుల్లో విషాదాన్ని నింపగా, కూకట్‌పల్లిలో తీవ్ర కలకలం రేపింది. పిత్తాశయంలో రాళ్లు ఉన్నాయని వైద్యులు గుర్తించడంతో చికిత్స కోసం మల్లయ్య ఈ నెల 26న కూకట్‌పల్లిలోని అనన్య ఆస్పత్రిలో చేరాడు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు శస్త్రచికిత్స అవసరమని చెప్పడంతో కుటుంబ సభ్యుల సమ్మతితో ఆపరేషన్ నిర్వహించినట్లు సమాచారం. శస్త్రచికిత్స అనంతరం మల్లయ్య తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని పలుమార్లు వైద్య సిబ్బందికి తెలియజేసినా, ఆపరేషన్ తర్వాత సాధారణంగానే నొప్పి ఉంటుందని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. రోగి నొప్పితో తల్లడిల్లుతున్నప్పటికీ సరైన వైద్యం అందించలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ మల్లయ్య ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అయితే ఈరోజు ఉదయం మల్లయ్య మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడమే మల్లయ్య మృతికి కారణమని వారు ఆరోపించారు. మల్లయ్య మృతితో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత కుటుంబ సభ్యులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసి, ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరస్మరణీయుడు ఎన్టీఆర్



మూసాపేట్, మే 28 ( హంస కలంవార్త )

తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత, స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా మోతీనగర్‌లోని ఆయన విగ్రహం వద్ద ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు తెలుగు జాతి గౌరవాన్ని జాతీయ స్థాయిలో నిలబెట్టిన మహోన్నత వ్యక్తిత్వం ఎన్టీఆర్‌దేనని కొనియాడారు. రాజకీయాల్లోనే కాకుండా సినీ రంగంలో కూడా తనదైన ముద్ర వేసి కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించుకున్న మహానుభావుడని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయన చేసిన సేవలు తెలుగు ప్రజలు ఎప్పటికీ మరువరని అన్నారు. కార్యక్రమం మొత్తం ఎన్టీఆర్ నినాదాలతో మార్మోగింది. కార్యక్రమంలో తిరుపతి, రాజ్‌కుమార్ గౌడ్, వెంకట్ స్వామి, తుకారాం, చక్రపాణి, శ్రీనివాస్, ధర్మయ్య, అశ్విన్, నరేష్, కృష్ణ, రాము పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు..

# హైదర్‌నగర్‌లో ఘనంగా బక్రీద్ వేడుకలు





హైదర్‌నగర్, మే 28 ( హంస కలంవార్త )

పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా హైదర్‌నగర్ డివిజన్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. డివిజన్ పరిధిలోని ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, కరుణ, మానవత్వం, సోదరభావానికి ప్రతీకగా నిలిచే గొప్ప పర్వదినమని అన్నారు. మత సామరస్యానికి, పరస్పర ప్రేమాభిమానాలకు ఈ పండుగ నిదర్శనమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని, అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్న ఆయన, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొని అష్టైశ్వర్యాలు కలగాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో ఆనందం, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర పర్వదినాన అల్లాహ్ ప్రతి ఒక్కరి ప్రార్థనలను, త్యాగాలను స్వీకరించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుతూ ఈద్ ముబారక్ అని నార్నె శ్రీనివాసరావు పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈద్గా వద్ద భక్తులతో సందడి నెలకొనగా, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ముస్లిం సోదరులు ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు..

# సర్వమత సమైక్యతకు బక్రీద్ వేదిక





జగద్గిరిగుట్ట, మే 28 ( హంస కలంవార్త )

ముస్లింల పవిత్ర బక్రీద్ పండుగ త్యాగానికి, దానధర్మాలకు ప్రతీక అని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పేర్కొన్నారు. గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా డివిజన్ పరిధిలోని మగ్దూమ్ నగర్ ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు కొలుకుల జగన్‌కు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం కొలుకుల జగన్ మాట్లాడుతూ, డివిజన్ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ రోజున పేదలకు దానం చేయడం ముస్లింల గొప్ప సంప్రదాయమని కొనియాడారు. జగద్గిరిగుట్ట డివిజన్ సర్వమత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి పండుగను ప్రజలు ఐక్యంగా జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రషీద్, మహమూద్, హాజీ, అన్వర్, యాసీన్, జాంగిర్, చాంద్ పాషా, సత్తిరెడ్డి, జనగామ శ్రీధర్, సాయిల్ యాదవ్ పాల్గొన్నారు..

# బక్రీద్ వేడుకల్లో మాధవరం

-బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సందడి..
-కేపీహెచ్‌బీ ఈద్గా వద్ద ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు..
-త్యాగం, సోదరభావమే బక్రీద్ సందేశం : మాధవరం..
-ముస్లిం సోదరులతో కలిసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు..



కేపీహెచ్‌బీ, మే 28 ( హంస కలంవార్త

పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కేపీహెచ్‌బీ ఈద్గా వద్ద గురువారం ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈద్గా ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో ముస్లింలు ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. పరస్పరం ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకోవడంతో ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్ ఆజ్ఞల పట్ల సంపూర్ణ విధేయతకు ప్రతీక అని పేర్కొన్నారు. హజ్రత్ ఇబ్రహీం చూపిన త్యాగ భావం ప్రపంచ మానవాళికి ఆదర్శమని అన్నారు. మతాలు వేరైనా మనమంతా ఒక్కటే అన్న భావనతో ప్రతి ఒక్కరూ సోదరభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రేమ, శాంతి, మానవతా విలువలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు. పండుగలు ప్రజలను ఏకం చేసే మహత్తర సందర్భాలని, బక్రీద్ కూడా పరస్పర గౌరవం, సేవా భావాన్ని చాటిచెప్పే పవిత్ర పర్వదినమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు, యువకులు హాజరై బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు..

## తెలుగుజాతి ఇలవేలుపు ఎన్టీఆర్‌కు ఘన నివాళి

-ఎల్లమ్మబండలో ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ..



ఆల్విన్ కాలనీ, మే 28 ( హంస కలంవార్త

తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. సూర్య చంద్రులు ఉన్నంత వరకు ప్రజల హృదయాల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంటుందని పేర్కొన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ప్రజాసేవకు కొత్త నిర్వచనం ఇచ్చిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి గౌరవాన్ని చాటిచెప్పిన మహానుభావుడు ఎన్టీఆర్ అని, కళారంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ సరికొత్త చరిత్ర సృష్టించారని అన్నారు. పార్టీ స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్యానికి కొత్త దిశ చూపారని గుర్తుచేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపారని తెలిపారు. తిండి, గూడు, బట్ట ప్రతి పేదవాడి హక్కు అన్న నమ్మకంతో పరిపాలన సాగించారని పేర్కొన్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు, మహిళలకు ఆస్తి హక్కులు, మహిళా రిజర్వేషన్లు, యువతకు రాజకీయ అవకాశాలు కల్పించడం వంటి సంస్కరణలతో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఎన్టీఆర్ మరణం లేని మహానేత అని, కోట్లాది ప్రజలకు స్ఫూర్తిగా నిలిచిన యుగపురుషుడు అని ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## బక్రీద్ సౌభ్రాతృత్వానికి ప్రతీక

-ముస్లిం సోదరులతో అలై-బలైలో పాల్గొన్న ముద్దం నరసింహ యాదవ్..



బోయిన్‌పల్లి, మే 28 ( హంస కలంవార్త )

పవిత్ర బక్రీద్ పండుగ ఈద్-ఉల్-అధా సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని ఈద్గా జామియా మజీద్ హుసేని ప్రాంగణం భక్తిశ్రద్ధలతో కళకళలాడింది. త్యాగం, భక్తి, మానవత్వానికి ప్రతీకగా భావించే ఈ పర్వదినాన్ని ముస్లిం సోదరులు అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక నమాజులు అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుంటూ అలై-బలైతో పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈద్గా ప్రాంగణానికి చేరుకున్న ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ తన బృందంతో కలిసి ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మత పెద్దలను, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, దానం, ప్రేమ, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో మత సామరస్యాన్ని కాపాడుతూ పరస్పర గౌరవ భావనతో అందరూ కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు. పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం బక్రీద్ పండుగ అసలు సందేశమని తెలిపారు. ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ ప్రాంత ప్రజలంతా ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు, భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు..

హంస కలం వార్త HAMSA KALAM VARTA

శుక్రవారం 29 మే 2026

## కరీంనగర్‌లో ముమ్మరంగా వాహనాల తనిఖీలు

-48 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

-1,479 వాహనాల తనిఖీ 60 నంబర్ ప్లేట్ లేని వాహనాలు గుర్తింపు

-115 చలానాలు విధింపు తనిఖీలను స్వయంగా పరిశీలించిన సీపీ గౌష్ ఆలం



హంసకలం వార్త

బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణ కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి పోలీసులు ముమ్మర నాఖాబంది వాహనాల తనిఖీలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన ఈ తనిఖీలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. బుధవారం అర్ధరాత్రి నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల లో?మొత్తం తనిఖీ చేసిన వాహనాలు: 1,479 "?డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు" 48 మందిపై కేసులు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. "?నంబర్ ప్లేట్ లేని వాహనాలు" నంబర్ ప్లేట్ సరిగ్గా లేని 60 వాహనాలను గుర్తించారు. "?చలానాలు" ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను 115 చలానాలు విధించారు. తనిఖీలకు నగర ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం కోరారు.

## ఐసీటీ అప్లికేషన్స్ పై నూతన గ్రంథం ఆవిష్కరించిన గుత్తా

హంసకలం వార్త



డాక్టర్ సుంకరి రాజారామ్,డాక్టర్ చేగోని రవికుమార్ సంయుక్తంగా రచించిన "ఐసీటీ అప్లికేషన్స్ ఇన్ అకాడమిక్ లైబ్రరీస్ ఆఫ్ తెలంగాణ" అనే నూతన గ్రంథాన్ని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హైదరాబాద్ అయన కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ విద్యా రంగంలో సమాచార సాంకేతికత వినియోగం ఎంతో కీలకమని, తెలంగాణలోని అకడమిక్ లైబ్రరీల అభివృద్ధికి ఈ పుస్తకం దోహదపడుతుందని అన్నారు. డిజిటల్ యుగంలో లైబ్రరీలు ఆధునీకరణకు ఇది మార్గదర్శిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.రచయితలు డాక్టర్ సుంకరి రాజారామ్ (ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల,అటానమస్ నల్గొండ) మరియు డాక్టర్ చేగోని రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణలోని అకడమిక్ లైబ్రరీల్లో ఐసీటీ వినియోగం, సవాళ్లు, అవకాశాలను ఈ పుస్తకంలో వివరంగా చర్చించామని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, లైబ్రేరియన్లకు ఇది ఉపయోగపడే సూచనా గ్రంథంగా రూపొందించినట్లు వారు వివరించారు.శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహచార్యులు ఈ పుస్తకాన్ని రచించిన డాక్టర్ సుంకరి రాజారామ్, డాక్టర్ చేగోని రవికుమార్లను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యారంగ ప్రముఖులు, లైబ్రేరియన్లు,పరిశోధకులు పాల్గొన్నారు.

## నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

-విలేజ్ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలి

-జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

హంసకలం వార్త



నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు,పెండింగ్ కేసుల దర్యాప్తు,రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు తదితర అంశాలను సమీక్షించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు,క్రైమ్ ప్రాపర్టీలు, సీజ్ చేసిన వాహనాలు,సీసీ కెమెరాల పనితీరు,కోర్టు సంబంధిత రికార్డులను పరిశీలించిన ఎస్పీ పలు సూచనలు చేశారు.ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ కావాలని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని,గ్రామ స్థాయి సమాచార వ్యవస్థను సమర్థంగా వినియోగించాలని సూచించారు.దొంగతనాలు, చోరీలు,ఇతర ఆస్తి నేరాల నివారణకు రాత్రి, పగలు పటిష్ట గస్తీ నిర్వహించాలని, ముఖ్యంగా హైవేలు,గ్రామ శివార్లు,నిర్మానుష్య ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టి, రౌడీషీటర్లు,అనుమానిత వ్యక్తులను తరచుగా తనిఖీ చేయాలని తెలిపారు.అలాగే సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించిన ఎస్పీ,ప్రజలు ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ తనిఖీలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఎస్‌బీ సీఐ ఆదిరెడ్డి,2టౌన్ సీఐ రాఘవరావు,రూరల్ ఎస్ఐ సైదాబాబు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్ రేకుర్తి ఈద్గాలో ఘనంగా బక్రీద్ ప్రార్థనలు: పాల్గొన్న సీపీ గౌష్ ఆలం

-ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన పోలీస్ కమిషనర్

హంసకలం వార్త





త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలిచే ముస్లింల పవిత్ర పండుగ 'బక్రీద్' "ఈద్-ఉల్-అజ్హా వేడుకలు "కరీంనగర్ నగరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక రేకుర్తిలోని ప్రధాన ఈద్గా వద్ద గురువారం ఉదయం జరిగిన పవిత్ర ప్రత్యేక ప్రార్థనల్లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు. ?ఈద్గాకు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు ముస్లిం మత పెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ప్రార్థనల అనంతరం సీపీ గౌష్ ఆలం ముస్లిం సోదరులందరికీ ఆలింగనం చేసుకుని, బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ సమాజంలో శాంతి, సోదరభావం, కరుణను మరింత పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. నగరంలో పండుగ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ తరపున అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.?అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కి, ఈద్గా వద్ద విధుల్లో ఉన్న ట్రైనీ ఐపిఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రూరల్ ఏసీపీ విజయ కుమార్, కొత్తపల్లి ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, మరియు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సీపీ కూడా విధుల్లో ఉన్న సిబ్బందిని అభినందిస్తూ, వారికి పండుగ శుభాకాంక్షలు అందజేశారు. నగరంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు పకడ్బందీగా నిర్వహించిన అధికారులను ఆయన అభినందించారు.

## ఈద్-ఉల్-అజ్హా పండుగ విశ్వాసం, త్యాగం, కరుణకు నిదర్శనం

-కుల గణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


-బీజేపీ రాజ్యాంగ విరుద్ధమైన చర్యలపై ధ్వజం

-గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలనే ప్రతిపాదనకు మద్దతు

-ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

హంసకలం వార్త





ఈద్-ఉల్-అజ్హా పర్వదినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణంలోని కోర్టు ఆవరణలో గల ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు.అనంతరం అక్కడికి విచ్చేసిన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఈద్-ఉల్-అజ్హా పండుగ విశ్వాసం, త్యాగం, కరుణ, మానవత్వం వంటి గొప్ప విలువలను సమాజానికి గుర్తు చేస్తుందన్నారు.ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం, ఐశ్వర్యం, సౌభ్రాతృత్వం నిండాలని ఆకాంక్షించారు. సమాజ సేవ, ఐక్యత, సోదరభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు కుల గణన మరియు ఎస్.ఐ.ఆర్ పై దేశంలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలు, కుల గణన ప్రాధాన్యతపై వివరంగా మాట్లాడాతూ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన (సెన్సస్) ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఎట్టి పరిస్థితుల్లోనూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కుల గణన అత్యంత కీలకం అన్నారు. దీనిపై స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను అక్రమంగా తొలగిస్తూ దేశ మనుగడకే ప్రమాదం తెచ్చేలా, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రాలపై ఒత్తిడి బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో ఎలక్షన్ కమిషన్‌పై ఒత్తిడి తెచ్చి, ఎస్ఐఆర్ పేరుతో లక్షలాది ప్రతిపక్ష ఓట్లను ఓటర్ల జాబితా నుండి తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు బెంగాల్, అస్సాం, బీహార్ రాష్ట్రాలే ఉదాహరణలు అన్నారు., పశ్చిమ బెంగాల్‌లో అధికారం దక్కించుకోవడం కోసం ఏకంగా 95 లక్షల ఓట్లను తొలగించారని, అలాగే బీహార్ రాష్ట్రంలోనూ ఇదే తరహాలో ఓట్లను తొలగించి అక్రమంగా ఎన్నికల్లో గెలిచారని ధ్వజమెత్తారు. ఇలాంటి రాజ్యాంగ విరుద్ధ చర్యలకు అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండి, తమ వివరాలను అందిస్తూ ఓటు హక్కును తప్పకుండా నమోదు చేసుకోవాలని మరియు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గంగా-జమునా తహజీబ్ వర్ధిల్లాలి

-భారతదేశం ఎంతో కాలంగా 'గంగా-జమునాతహజీబ్'

భిన్నత్వంలో ఏకత్వం అనే సాంప్రదాయంతో వర్ధిల్లుతోందన్నారు, అయితే మతతత్వ బీజేపీ పార్టీ ప్రజల మధ్య విద్వేషాలు రేపి, సమాజాన్ని విడదీసి రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందని విమర్శించారు. అలాగే, ఆవును దేశ జాతీయ జంతువుగా ప్రకటించాలని దేశ ముస్లిం మత పెద్దలు కోరగా, మహమ్మద్ అలీ షబ్బీర్ సంపూర్ణ సమర్థన తెలుపుతూ మద్దతు ప్రకటించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ లౌకికత్వానికి కట్టుబడి ఉంటుందని స్పష్టం చేస్తూ, భారతీయులందరూ ఒకటే. కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా దేశాభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, మత పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## మీడియా ముందుకు ముసుగులతో ఎందుకు

హంసకలం వార్త

ప్రతిరోజూ టీవీల్లో,సోషల్ మీడియాలో,పత్రికల్లో ఒక దృశ్యం తరచూ కనిపిస్తుంది.పోలీసులు అరెస్ట్ చేసిన వ్యక్తిని మీడియా ముందు తీసుకొస్తుంటారు.కానీ, అతని ముఖం మాత్రం టవల్‌తో, హెల్మెట్‌తో, మాస్క్‌తో లేదా గుడ్డతో కప్పి ఉంటుంది.ఇది చూసిన చాలామందికి ఒక సందేహం వస్తుంది."నేరం చేశాడంటే ముఖం ఎందుకు దాచుతున్నారు?" అని. మరికొందరు "పోలీసులు పట్టుకున్నారంటే అతడు నేరస్తుడే కదా?" అని భావిస్తారు.కానీ,చట్టం మాత్రం అలా అనదు.అతడు నేరం చేశాడని రుజువు అయ్యే వరకు నేరస్తుడా...? లేక నిందితుడా...? అనేది చట్టం తేల్చడానికి లేదు. ఇక్కడే "నిందితుడు" (ూాఎఇబంవస) మరియు "నేరస్తుడు" (జశీఅజఱవ్‌) మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోవాలి.పోలీసులు ఒక వ్యక్తిపై అనుమానం లేదా ఆధారాల ఆధారంగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తారు.కానీ,అతడు నిజంగా నేరం చేశాడా లేదా అన్నది తుది నిర్ణయం చెప్పేది కోర్టు మాత్రమే. కోర్టు శిక్ష విధించే వరకు చట్టపరంగా అతడు "నిందితుడు" మాత్రమే... "నేరస్తుడు" కాదు.ఇదే భారత న్యాయ వ్యవస్థలో అత్యంత కీలకమైన సూత్రం.అందుకే అనేక సందర్భాల్లో నిందితుల ముఖాలను ముసుగులతో కప్పి మీడియా ముందు ప్రవేశపెడతారు.దీని వెనకాల ప్రధాన ఉద్దేశ్యం వారి వ్యక్తిగత గౌరవం,సామాజిక ప్రతిష్టకు ముందుగానే శాశ్వత నష్టం కలగకుండా చూడటమే.ఎందుకంటే ఒకసారి ముఖం టీవీల్లో,సోషల్ మీడియాలో వైరల్ అయితే...తర్వాత కోర్టు అతడిని నిర్దోషిగా ప్రకటించినా సమాజం మాత్రం అతడిని జీవితాంతం "నేరస్తుడు" గానే చూసే ప్రమాదం ఉంటుంది. ఒక్కసారి ఆలోచిస్తే...ఒక వ్యక్తి తప్పుగా కేసులో ఇరుక్కుంటే? తర్వాత కోర్టులో నిర్దోషిగా బయటపడితే? అప్పటికే అతని ఫోటోలు దేశమంతా తిరిగి పోతాయి.కుటుంబం అవమానాన్ని ఎదుర్కొంటుంది. ఉద్యోగం పోవచ్చు.పిల్లలు సమాజంలో తలెత్తుకోలేకపోవచ్చు. అంటే శిక్ష పడక ముందే అతడు సామాజికంగా శిక్ష అను భవించినట్టే అవుతుంది.అందుకే చట్టం "ప్రతివాడూ కోర్టు నిరూపించే వరకు నిర్దోషి" అనే సూత్రాన్ని పాటిస్తుంది. అయితే ప్రతి కేసులోనూ ఇలా ముఖం కప్పరు.కొన్ని సందర్భాల్లో పోలీసులు స్వయంగా మీడియాకు నిందితుల ఫోటోలు విడుదల చేస్తారు. ముఖ్యంగా ప్రజలకు హెచ్చరిక అవసరమైనప్పుడు, పరారీలో ఉన్నప్పుడు లేదా ప్రజల సహకారం అవసరమైనప్పుడు ఇలా చేస్తారు.మరోవైపు కొన్ని కేసుల్లో నిందితులే తమ ముఖం దాచుకునేందుకు ప్రయత్నిస్తారు. ఎందుకంటే మీడియా తీర్పు చాలా వేగంగా ఉంటుంది.కోర్టు తీర్పు రాకముందే సమాజం తీర్పు చెప్పేస్తుంది.ఇక్కడ మరో కీలకమైన అంశం మీడియా పాత్ర.ప్రజలకు సమాచారం అందించడం మీడియా బాధ్యత.కానీ,అదే సమయంలో ఒక వ్యక్తి హక్కులను కూడా గౌరవించాల్సిన బాధ్యత ఉంది. కొన్నిసార్లు టీవీ డిబేట్లు,బ్రేకింగ్ న్యూస్ సంస్కృతి కారణంగా కోర్టు విచారణకు ముందే నిందితులను "నేరస్తులు" గా ముద్ర వేయడం జరుగు తోంది.దీనిని న్యాయ నిపుణులు "మీడియా ట్రయల్"గా పేర్కొం టున్నారు. ఇది న్యాయ ప్రక్రియపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉందని పలువురు న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు.ఇంకో కోణంలో చూస్తే ముఖం కప్పడం అంటే నేరాన్ని



దాచడం కాదు.అది చట్టపరమైన జాగ్రత్త.ఒక వ్యక్తి హక్కులను కాపాడే విధానం. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో చట్టం భావోద్వేగాలతో కాదు,ఆధారాలతో పనిచేస్తుంది. పోలీసులు అనుమానిస్తారు.దర్యాప్తు చేస్తారు. కానీ, తుది తీర్పు మాత్రం కోర్టుదే.ఈ నేపథ్యంలో సమాజం కూడా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. సోషల్ మీడియాలో ఒక వీడియో చూసి,ఒక ఫోటో చూసి వెంటనే తీర్పులు ఇవ్వడం ప్రమాదకరం. ఎందుకంటే ప్రతి అరెస్ట్ అయిన వ్యక్తి చివరకు నేరస్తుడిగా తేలిపోడు.అనేక కేసుల్లో కోర్టులు నిర్దోషిగా విడుదల చేసిన ఉదాహరణలు ఉన్నాయి.ముసుగు వెనకాల దాగి ఉన్న అసలు నిజం ఇదే.అది నేరాన్ని కాపాడే గుడ్డ కాదు,న్యాయం పూర్తయ్యే వరకు ఒక మనిషి గౌరవాన్ని కాపాడే చట్టపు జాగ్రత్త.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ పరంగా కొనుగోలు చేస్తున్నాం

-రైతులు ఆందోళనకు గురి కావద్దు
-కలెక్టర్ ఇలా త్రిపాఠి

హంసకలం వార్త

అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వంపరంగా కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరిస్తున్న తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామని అన్నారు. రాష్ట్ర సచివాలయం నుండి బుధవారం రాత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ధాన్యం సేకరణను వేగవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్లకు స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటికే ధాన్యం సేకరణ ప్రక్రియ ముగింపు దశకు చేరిందని అన్నారు. అయితే దిగుబడులు ఆలస్యంగా వచ్చిన చోట ధాన్యం సేకరణ కోసం ఇంకనూ సుమారు 120 వరకు కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. అకాల వర్షం కురిసిన కారణంగా జిల్లాలో బషీరాబాద్, ఉప్లూర్ తదితర ప్రాంతాల్లో సుమారు 40 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం బస్తాలు తడిసినట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం పంపడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వేగవంతంగా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. తాను కూడా స్వయంగా మిల్లులను సందర్శించి, ధాన్యం




తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియలను పరిశీలించాలని కలెక్టర్ వెల్లడించారు. తడిసిన ధాన్యం విషయమై ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు మేరకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడం జరుగుతోందని ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు భరోసా కల్పించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందుగా తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి అంతర్జాతీయ రూపురేఖలు

-మంత్రి పొంగులేటి ఆదేశాలతో
రూపుదిద్దుకుంటున్న సమగ్ర మాస్టర్ ప్లాన్..
-చారిత్రక క్షేత్రంలో వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన..

హంసకలం వార్త

నేలకొండపల్లి : నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ క్షేత్రం అభివృద్ధి కోసం రూ. 2.50 కోట్ల నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. అయితే ఈ నిధులతో పాటు ఈ చారిత్రక క్షేత్రానికి అంతర్జాతీయ స్థాయి హంగులు అద్దేందుకు ఇంకా ఎంత వ్యయం అవుతుంది, ఎలాంటి పనులు చేపట్టాలనే అంశాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించిన నేపథ్యంలో గురువారం వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది.

-డి.పి.ఆర్ రూపకల్పన కోసం ఉన్నత స్థాయి



బృందం..

తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాటి, బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటార్ సి.ఆంజనేయ రెడ్డి నేతృత్వంలోని ఉన్నతాధికారులు, పురావస్తు నిపుణుల బృందం నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని విస్తృతంగా పరిశీలించింది. మంజూరైన రూ. 2.50 కోట్ల నిధుల వినియోగంతో పాటు, భవిష్యత్ నిధుల అంచనాలు, ల్యాండ్ స్కేపింగ్, పర్యాటక హంగుల రూపకల్పనపై నిపుణుల బృందం క్షేత్రస్థాయిలోనే సుదీర్ఘంగా సమీక్షించింది.

-ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ సర్వే..

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా, కేవలం ఉపరితల తవ్వకాలకే పరిమితం కాకుండా ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ జియోఫిజికల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. దీనిద్వారా



భూగర్భంలో దాగివున్న చారిత్రక అవశేషాలను శాస్త్రీయంగా వెలికితీసి రక్షించనున్నారు. అలాగే, పర్యాటక వసతుల విస్తరణ కోసం సుమారు నాలుగు ఎకరాల భూమిని సేకరించాలని తీర్మానించారు.

-ఆధునిక పర్యాటక వసతులు..

ఇక్కడ పర్యాటకుల కోసం చరిత్రను ప్రతిబింబించే త్రీడీ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, ఆడియో-విజువల్ గ్యాలరీలు, ఓపెన్ ఎయిర్ అంఫీ థియేటర్, అంతర్జాతీయ స్థాయి వాకింగ్ మార్గాలు, లైటింగ్ వంటి మౌలిక వసతులను ఈ నివేదికలో చేర్చనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు, పూర్తి వ్యయ అంచనాలతో కూడిన ఈ 'సమగ్ర నివేదిక' ను రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామని వారసత్వ శాఖ డైరెక్టర్ వెల్లడించారు.

# మా మీద నుండి జేసీబీ ఎక్కించినా సరే! భూములు ఇవ్వం

-అధికారులను అడ్డుకుని, మండుటెండలో జేసీబీకి అడ్డంగా పడుకున్న రైతులు
-ఫ్రూట్ మార్కెట్ భూసేకరణ కు వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులు
-ఈ సందర్భంగా పోలీసులు, గ్రామస్తులకు మధ్య తీవ్ర ఘర్షణ
-తమ భూములు అన్యాయం గా లాక్కోటోందని కొహెడ భూబాధితుల ఆగ్రహం
-జూన్ 3 న ముఖ్యమంత్రి ప్రారంభోత్సవకార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరిక

హంసకలం వార్త

కోహెడ గ్రామంలో ఫ్రూట్ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం భూసేకరణకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. జేసీబీ ముందు పడుకుని తమ భూములు ఇవ్వమంటూ నిరసన తెలిపారు. ఫ్రూట్ మార్కెట్ భూసేకరణ కు వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులు రంగారెడ్డి జిల్లా కోహెడ గ్రామంలో ఫ్రూట్ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ఏర్పాటు కోసం భూ సేకరణ చేసేందుకు వచ్చిన అధికారులకు స్థానిక రైతులు, ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. అధికారులను అడ్డుకుని, మండుటెండలో జేసీబీకి అడ్డంగా పడుకు న్న రైతులు భూసేకరణను వ్యతిరేకిస్తూ తమ నిరసన వ్యక్తం



చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, గ్రామస్తులకు మధ్య తీవ్ర ఘర్షణ నెలకొంది. దీంతో భారీ సంఖ్యలో అక్కడ పోలీసులను మోహరించి భూసేకరణ ప్రక్రియకు అధికారులు సిద్ధమయ్యారు

-ప్రభుత్వం తమ భూములు లాక్కోటోందని కొహెడ భూబాధితులు ఆగ్రహం

పండ్ల మార్కెట్ నిర్మాణం పేరిట ప్రభుత్వం అన్యాయం గా తమ భూములు లాక్కోటోందని కొహెడ భూ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు హైకోర్టు న్యాయవాదులతో కలిసి కొహెడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ సర్వే నంబర్167/1లో ఎస్సీ, బీసీలకు చెందిన సుమారు 260 ఎకరాల భూమిని అన్యాయంగా లాక్కునేందుకు ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. 1955, 1958 సంవత్సరాల నుంచి కొహెడకు చెందిన సాదు రంగయ్య, సాదు ఈదయ్య తదితరుల పేర్లు రికార్డుల్లో ఉన్నాయని, 1992 వరకు ప్రభుత్వానికి ప్రతి ఏటా పన్నులు చెల్లించామన్నారు.



-జూన్ 3 న ముఖ్యమంత్రి ప్రారంభోత్సవకార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరిక

అధికారులు కొత్తగా ఈ పాసు పుస్తకాలను ఇవ్వక పోవడంతో 2025లో కలెక్టర్,ఆర్డీఓ, తహసీల్దార్లపై హైకోర్టులో కంటెంట్ కేసు వేశామన్నారు అధికారులు కోర్టుకు జవాబు చెప్పకుండా పోలీసుల సహకారంతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ పనులను చేపడుతున్నారని ఆరోపించారు. జూన్ 3వ తేదీన నిర్వహించనున్న మార్కెట్ ప్రారంభోత్సవ పనులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థంకోసం మా భూముల ను లాక్కుంటున్నారని ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సాదు రాములు, యాదగిరి, కృష్ణ, మహేశ్, దానయ్య, బుడ్డ జంగయ్య,ఆగమయ్య పంది సతీశ్, శీలం అంగత్ తదితరులు పాల్గొన్నారు.

# టేకుమట్ల గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించిన

-కార్మిక,మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి

హంసకలం వార్త

మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించిన కార్మిక,మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి ఆర్టీసీ బస్సుకు జెండా ఊపి ప్రారంభించిన మంత్రి బస్సు సౌకర్యాన్ని కల్పించినందుకు గ్రామస్తులు మంత్రి వివేక్ వెంకట స్వామి నీ శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ...బస్సు సౌకర్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.చెన్నూరు నియోజకవర్గం



లో బస్సు సౌకర్యం లేని 14 గ్రామాలకు బస్సులు వేసి నడిపించాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది.చెన్నూరు నియోజకవర్గం లో ప్రయాణికులు ఎవరు ఇబ్బందులు పడొద్దు మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి




ఉంది.లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టింది గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతున్నాం.

## తడిసిన వరి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

-ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావులేకుండా చూడాలి
-ఓపీఎంఎస్ నమోదు, ట్రక్ షీట్లు, లోడింగ్, అన్లోడింగ్ పై ఆరా
-మిల్లుల వద్ద లారీలు ఆగకుండా తగు చర్యలు చేపట్టాలి
-జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



హంసకలం వార్త

రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర దక్కేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అన్నారు. రైతులు ధాన్యం అమ్మకానికి వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించలని అధికారులను ఆదేశించారు. తేమ కారణంగా తడిసిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కూడా రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. గురువారం అచ్చంపేట మండలం పరిధిలోని చెన్నారం గ్రామంలోని లలిత ఉమామహేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్‌తో పాటు నడింపల్లి గ్రామంలోని వెంకటేశ్వర కాటన్ మిల్లులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మిల్లులలో నిల్వ ఉంచిన వరి, మొక్కజొన్న ధాన్యాం బస్తాల నిలువలను పరిశీలించి నిల్వ సామర్థ్యం, కొనుగోలు ప్రక్రియ, మిల్లింగ్ వ్యవస్థపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లులలో రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలా నిల్వ చేస్తున్నారో, గిడ్డంగుల సామర్థ్యం ఎంత ఉందో, నాణ్యత పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వలో నిర్లక్ష్యం వహిస్తే నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని, కాబట్టి వర్షాల నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి, మొక్కజొన్న ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేయాలని, నిల్వ గిడ్డంగులు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. హమాలీల సంఖ్య, అందుబాటులో ఉన్న హమాలీలు ఎంత మంది? అనే వివరాలు తెలుసుకొని, అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా తూకం ప్రక్రియ, రవాణా ఏర్పాట్లు వేగవంతం చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు అనంతరం వెంటనే మిల్లింగ్ ప్రక్రియకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను సక్రమంగా పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రతి దశలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు, రవాణా, చెల్లింపుల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతుల అభిప్రాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు కూడా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. అధికారులు రైతుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎక్కడా రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలలో అచ్చంపేట తహసీల్దార్ సైదులు, సంబంధిత శాఖల అధికారులు, మిల్లుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## జంతు వ్యర్థాలను డంపింగ్ యార్డ్ కు తరలించాలి



హంసకలం వార్త

:బక్రీద్ పర్వదినం సందర్భంగా ఆనందోత్సాహాల మధ్య పండగ వేడుకలను జరుపుకున్నారు.పండగ సందర్భంగా ఎలాంటి శాంతి భద్రతలకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.ముస్లిం లందరికీ ఈదుల్ అజా శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య జిల్లా కేంద్రం లోని ఈద్గాలనూ పరిశీలించారు.ఈద్గాల వద్ద నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది తో పాటు పోలీస్ సిబ్బంది కలిసి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.ప్రార్థనలు జరిపే ప్రాంతం వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.పవిత్ర బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు పండగ సందర్భంగా జరిపే జంతు వదల అనంతరం వాటి వ్యర్థాలను ప్రత్యేక కవర్ లో ఏర్పాటు చేసిన ప్రాంతం లో పదవెయ్యాలని సూచించారు ప్రతి ఒక్కరు పండగను సంతోషాల మధ్య జరుపుకోవాలని కోరారు.జంతు వ్యర్థాలు ప్రజల మధ్యనే వదిలి వేయడం వల్ల దుర్గంధం వెదజల్లి ఆ ప్రాంతం అంత దుర్భరంగా మారే అవకాశం ఉందని ప్రజలు సహకరించి వ్యర్థాలను సూచించిన ప్రాంతానికి తరలించాలన్నారు. ఈద్గాల ను సందర్శించిన అనంతరం పండగ శుభాకాంక్షలు తెలిపారు.

# బిజినెస్

## రోజుకు రూ.550 కోట్ల నష్టాన్ని భరిస్తున్న ప్రభుత్వ చమురు సంస్థలు



అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశీయంగా సామాన్యులపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు (పీఎస్‌యూలు) పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అమ్మకాలపై రోజుకు సుమారు రూ.550 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ధరలు పెరిగాయి. అయినప్పటికీ, ఆ పెరిగిన ధరలను దేశీయ రిటైల్ మార్కెట్‌కు బదిలీ చేయకుండా వినియోగదారులకు ఉపశమనం కల్పిస్తున్నారు. ఈ ప్రయోజనం కేవలం సాధారణ గృహాలు, ద్విచక్ర వాహనదారులు, రైతుల వంటి రిటైల్ వినియోగదారులకు మాత్రమేనని, పారిశ్రామిక కొనుగోళ్లకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ఈ ధరల వ్యత్యాసం వల్ల కొత్త సమస్య తలెత్తింది. పారిశ్రామిక అవసరాల కోసం పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేసేవారు కూడా తక్కువ ధరకు లభించే రిటైల్ బంకులకు వస్తున్నారు. దీనివల్ల ప్రైవేట్ సంస్థల డీజిల్ అమ్మకాలు 38 శాతం పడిపోగా, ఆ భారం ప్రభుత్వ రంగ బంకులపై పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇది స్థానిక కొరతకు దారితీసే ప్రమాదం ఉందని మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన కేంద్రం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. 'అత్యవసర వస్తువుల చట్టం' కింద చర్యలు చేపట్టాలని, ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని సూచించింది. సామాన్యుల కోసం ఉద్దేశించిన ఇంధనాన్ని పారిశ్రామిక అవసరాలకు మళ్లించవద్దని పరిశ్రమల సంఘాలకు కూడా హెచ్చరికలు జారీ చేసింది.

# కొత్త టాటా టియాగో ఫేస్‌లిఫ్ట్ వచ్చేసింది..

## అన్ని ఎలక్ట్రిక్ కార్లపై లైఫ్ టైమ్ వారంటీ ప్రకటన!

- మార్కెట్లోకి 2026 టాటా టియాగో, టియాగో ఈవీ ఫేస్‌లిఫ్ట్ మోడళ్లు విడుదల
- పెట్రోల్ వేరియంట్ ప్రారంభ ధర రూ. 4.69 లక్షలు.. ఈవీ ధర రూ. 6.99 లక్షలు
- టాటా ఎలక్ట్రిక్ వాహనాలపై జీవితకాల, అపరిమిత కిలోమీటర్ల వారంటీ ప్రకటన
- లాంగ్ రేంజ్ టియాగో ఈవీ ఒక్క చార్జ్‌తో 285 కిలోమీటర్ల రేంజ్
- ఫాస్ట్ చార్జింగ్‌తో 18 నిమిషాల్లోనే 100 కిలోమీటర్ల రేంజ్ పొందే సౌకర్యం




భారత ఆటోమొబైల్ మార్కెట్లో తీవ్రమైన పోటీ నెలకొన్న హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు టాటా మోటార్స్ కీలక అడుగు వేసింది. చాలాకాలం తర్వాత తన ఎంట్రీ-లెవల్ హ్యాచ్‌బ్యాక్ టియాగోకు భారీ అప్‌డేట్లను అందిస్తూ, 2026 టాటా టియాగో ఫేస్‌లిఫ్ట్, టియాగో ఈవీ మోడళ్లను గురువారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఆకర్షణీయమైన డిజైన్ మార్పులు, సరికొత్త ఫీచర్లతో పాటు సంచలన ధరలను ప్రకటించి వినియోగ దారుల దృష్టిని ఆకర్షిస్తోంది. మారుతి సుజుకి స్విఫ్ట్, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ వంటి బలమైన పోటీదారులకు గట్టి సవాలు విసిరేలా ఈ కొత్త మోడళ్లను తీర్చిదిద్దారు.

**అన్ని వేరియంట్ల ధరల వివరాలు**

టాటా మోటార్స్ ఈ కొత్త మోడళ్లను పెట్రోల్, ఈవీ, సీఎన్‌జీ వేరియంట్లలో అందుబాటులోకి తెచ్చింది. టాటా టియాగో (పెట్రోల్): దీని ప్రారంభ ధరను రూ. 4.69 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) నిర్ణయించారు. టాటా టియాగో ఈవీ: ఎలక్ట్రిక్ వేరియంట్ ప్రారంభ ధర రూ. 6.99 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) ఉంది. టియాగో ఈవీ : బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ పద్ధతిలో కారును రూ. 4.69 లక్షలకు కొనుగోలు చేసి, కిలోమీటరుకు రూ. 2.6 చొప్పున చెల్లించే సౌకర్యాన్ని కూడా కల్పించారు. టాటా టియాగో ఐసీఎన్‌జీ: సీఎన్‌జీ వేరియంట్ ప్రారంభ ధర రూ. 5.79 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) ఉంది.

**టాటా సంచలనం.. లైఫ్ టైమ్ వారంటీ**

ఈ లాంచ్ ఈవెంట్‌లో టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ఒక సంచలనాత్మక ప్రకటన చేసింది. ఇకపై తమ అన్ని ఎలక్ట్రిక్ వాహనాలపై జీవితకాల, అపరిమిత కిలోమీటర్ల వారంటీని అందిస్తున్నట్లు ప్రకటించింది. టియాగో ఈవీతో పాటు పంచ్ ఈవీ, హ్యారియర్ ఈవీ, కర్వ్ ఈవీ, టిగోర్ ఈవీ వంటి అన్ని టాటా ఎలక్ట్రిక్ కార్లకు ఈ వారంటీ వర్తిస్తుంది. ఇది పరిశ్రమలోనే ఒక విప్లవాత్మక నిర్ణయంగా భావిస్తున్నారు.

**టియాగో ఈవీ: రేంజ్, చార్జింగ్ ఆప్షన్లు**

కొత్త 2026 టియాగో ఈవీని స్మార్ట్, ప్యూర్ ప్లస్, క్రియేటివ్ ప్లస్ అనే మూడు ట్రిమ్‌లలో విడుదల చేశారు. ఇది లాంగ్ రేంజ్, మీడియం రేంజ్ అనే రెండు వేరియంట్లలో లభిస్తుంది. లాంగ్ రేంజ్: ఇందులో 24 ఎవొష్ట బ్యాటరీ ప్యాక్ ఉంటుంది. ఇది ఒక్కసారి ఫుల్ చార్జ్ చేస్తే 285 కిలోమీటర్ల వరకు రేంజ్ (ప్రకారం) ఇస్తుంది. మీడియం రేంజ్: ఇందులో 19.2 బ్యాటరీ ప్యాక్ అమర్చారు. చార్జింగ్ కోసం 3.3 పోర్టబుల్ చార్జర్, 7.2 హోమ్ చార్జర్, 30 డీసీ ఫాస్ట్ చార్జింగ్ ఆప్షన్లు ఉన్నాయి. 30 ఫాస్ట్ చార్జర్‌తో కేవలం 18 నిమిషాల్లోనే 100 కిలోమీటర్ల ప్రయాణానికి సరిపడా చార్జింగ్ చేసుకోవచ్చు.

# 15 ఏళ్లకే కోట్లకు పడగెత్తిన వైభవ్... ఆస్తి ఎంతో తెలుసా?

ప్రస్తుతం భారత క్రికెట్ ప్రపంచంలో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మారుమోగిపోతోంది. ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్) తరపున సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) పై కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఈ అద్భుత ప్రదర్శన తర్వాత అతని సంపాదన, నికర ఆస్తి పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చిన్న వయసులోనే ఈ యువ కెరటం రూ.10 కోట్లకు పైగా ఆస్తిని కూడబెట్టడం విశేషం.




**ఐపీఎల్ ద్వారా కోట్ల ఆదాయం**

2025 మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను రూ.1.1 కోట్లకు కొనుగోలు చేసింది. రెండో ఏడాది కూడా అదే మొత్తాన్ని జీతంగా అందుకుంటున్నాడు. దీంతో రెండేళ్లలో అతని ఐపీఎల్ జీతం రూ.2.2 కోట్లకు చేరింది. దీనికి అదనంగా ఆడిన ప్రతి మ్యాచ్‌కు రూ.7.5 లక్షల మ్యాచ్ ఫీజు లభిస్తుంది. ఇప్పటివరకు 22 మ్యాచ్‌లు ఆడిన వైభవ్‌కు కేవలం మ్యాచ్ ఫీజుల రూపంలోనే సుమారు రూ.1.65 కోట్లు అందాయి. అతని అద్భుత ఆటతీరు చూస్తుంటే, వేలంలో చెల్లించిన మొత్తం చాలా తక్కువ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆస్తులు.. ఖరీదైన బహుమతులు**

క్రికెట్ ఆదాయంతో పాటు వైభవ్‌కు విలువైన ఆస్తులు కూడా ఉన్నాయి. ముంబైలో సుమారు రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల విలువ చేసే విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌ను అతను కొనుగోలు చేశాడు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా తాజ్‌పూర్‌లో ఉన్న అతని పూర్వీకుల ఇంటి విలువ కూడా రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని అంచనా. 2025 ఐపీఎల్‌లో అత్యధిక స్ట్రైక్ రేట్ సాధించినందుకు బహుమతిగా రూ.17 లక్షల విలువైన టాటా కర్వ్ ఈవీ కారును గెలుచుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ సహ యజమాని రంజిత్ బర్తకూర్ అతనికి మెర్సిడెస్ బెంజ్ కారును బహుమతిగా ఇచ్చినట్లు సమాచారం. 2026 అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు అప్పటి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నుంచి రూ.50 లక్షల నగదు బహుమతి కూడా అందుకున్నాడు.

**స్పాన్సర్‌షిప్‌లతో రెట్టింపు ఆదాయం**

ఐపీఎల్ జీతం, మ్యాచ్ ఫీజులు, ఆస్తులు, బహుమతుల విలువ కలిపి సుమారు రూ.7 కోట్లుగా ఉన్నప్పటికీ, వైభవ్‌కు పెరుగుతున్న స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు అతని నికర ఆస్తిని గణనీయంగా పెంచుతున్నాయి. వివిధ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరించడం ద్వారా వస్తున్న ఆదాయంతో అతని మొత్తం నికర ఆస్తి విలువ రూ.10 కోట్లు దాటి ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఈ స్థాయిలో సంపాదించడం అతని ప్రతిభకు, భవిష్యత్తుకు నిదర్శనంగా నిలుస్తోంది.

# స్పోర్ట్స్

## నిన్నటి విధ్వంసకర ఇన్నింగ్స్ తర్వాత.. సోషల్ మీడియాలో వైభవ్ మూడు పదాల సందేశం




ఐపీఎల్ 2026లో ఓ యువ సంచలనం క్రికెట్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్‌కు చెందిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ, బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్‌తో తన జట్టును గెలిపించాడు. కేవలం 29 బంతుల్లో 97 పరుగులు చేసిన వైభవ్, క్రిస్ గేల్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ టీ20 సెంచరీ రికార్డును త్రుటిలో చేజార్చుకున్నాడు. అయినప్పటికీ, అతని మెరుపు ఇన్నింగ్స్ రాజస్థాన్‌కు కీలక విజయాన్ని అందించి, ఫైనల్ ఆశలను సజీవంగా నిలిపింది. ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్ 2కు అర్హత సాధించింది. శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు, ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో అమీతుమీ తేల్చుకుంటుంది. మ్యాచ్ అనంతరం తన ఇన్‌స్టాగ్రామ్‌లో వైభవ్.. 'ఇంకా కావాలనే ఆకలి' అంటూ మూడు పదాల సందేశంతో తన ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించాడు.వైభవ్ అద్భుత ప్రదర్శనపై దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం ఏబీ డివిలియర్స్ ప్రశంసల వర్షం కురిపించాడు. "కేవలం 15 ఏళ్ల వయసులో ఇంతటి ఆట అవగాహన, పరిణతి చూపడం అసాధారణం" అని కొనియాడాడు. ఒత్తిడితో కూడిన నాకౌట్ మ్యాచ్‌లో అద్భుతమైన షాట్ సెలక్షన్‌తో పాటు వైభవ్ చూపిన ప్రశాంతత తనను ఎంతగానో ఆకట్టుకుందని డివిలియర్స్ జియోస్టార్‌తో అన్నాడు.

హంస కలం వార్త
శుక్రవారం 29 మే 2026

# డాన్ 3: అట్లీ డైరెక్ట్ చేస్తేనే వస్తా.. షరతు పెట్టిన షారుక్!

- డాన్ 3 ప్రాజెక్ట్ నుంచి వైదొలిగిన రణ్‌వీర్ సింగ్
- తిరిగి షారుక్ ఖాన్‌తో చర్చలు జరుపుతున్న చిత్రబృందం
- హీరోయిన్‌గా కృతి సనన్ పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం
- విలన్ పాత్ర కోసం విజయ్ దేవరకొండను సంప్రదించారనే వార్తలు



బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ ఫ్రాంచైజీ 'డాన్ 3'కి సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఇండస్ట్రీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ ప్రాజెక్ట్ నుంచి హీరో రణ్‌వీర్ సింగ్ తప్పుకోవడంతో, మేకర్స్ తిరిగి షారుక్ ఖాన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ సినిమాలో మళ్లీ నటించడానికి కింగ్ ఖాన్ ఒక పెద్ద కండిషన్ పెట్టినట్లు బాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో 'డాన్', 'డాన్ 2' చిత్రాల్లో తన నటనతో పాత్రకు జీవం పోసిన షారుక్ ఖాన్, మూడో భాగం స్క్రిప్ట్‌పై అసంతృప్తితో ప్రాజెక్ట్‌ను నిరాకరించారు. దీంతో ఆయన స్థానంలో రణ్‌వీర్ సింగ్‌ను ఎంపిక చేశారు. అయితే, తాజాగా రణ్‌వీర్ కూడా ఈ సినిమా నుంచి వైదొలగడంతో 'డాన్ 3' భవిష్యత్తు మళ్లీ మొదటికి వచ్చింది. ఈ నేపథ్యంలో చిత్రబృందం మరోసారి షారుక్‌తో చర్చలు ప్రారంభించింది. ఈ క్రమంలో షారుక్ ఒక ఆసక్తికరమైన షరతు విధించినట్లు సమాచారం. 'జవాన్' చిత్రంతో తనకు బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన దర్శకుడు అట్లీకి 'డాన్ 3' దర్శకత్వ బాధ్యతలు అప్పగిస్తేనే తాను ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతానని ఆయన స్పష్టం చేసినట్లు టాక్. ఈ వార్తలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, ఇది బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు, ఈ చిత్రంలో హీరోయిన్‌గా మొదట కియారా అద్వాణీ పేరు వినిపించినా, ప్రస్తుతం కృతి సనన్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే విలన్ పాత్ర కోసం విజయ్ దేవరకొండ, విక్రాంత్ మాస్సే పేర్లను సంప్రదించారని కథనాలు వస్తున్నాయి. మరి ఈ ఊహాగానాలకు ఎప్పుడు తెరపడుతుందో చూడాలి.

## ప్రతి ఒక్కరూ చూడవలసిన గ్రిప్పింగ్ థ్రిల్లర్ ఇది!



డబ్బుంటే ఆశలు నెరవేర్చుకోవచ్చు కలలు నిజం చేసుకోవచ్చు కోరుకున్నట్లుగా బ్రతకొచ్చు. అయితే డబ్బుంటే కోరుకున్న సర్టిఫికెట్ ను సంపాదించుకోవచ్చు .. మనసు పడిన జాబ్ ను పొందవచ్చు అనేది చాలా తక్కువ మందికి తెలుసు. అదెలా సాధ్యమనేది చాటిచెబుతున్న సిరీస్ 'ఎగ్జామ్'. సర్కుణం దర్శకత్వం వహించిన ఈ సిరీస్, అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. దుషారా విజయన్ - అదితి బాలన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్, 7 ఎపిసోడ్స్ గా ఈ నెల 15వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. కాసులుంటే చాలు కష్టపడి చదవాల్సిన పనిలేదు. కష్టపడిన వాళ్లందరినీ దాటుకుంటూ వెళ్లి, వాళ్ల కళ్లముందరే కోరుకున్న సీట్లో కూర్చోవచ్చు. పుస్తకాలలో ఏముందో తెలుసుకోవడం కాదు, ఇక్కడ జరుగుతున్న దందాపై కూడా ఒక లుక్కేయమని చెప్పే సిరీస్ ఇది. అవకాశం లేదనీ .. అదృష్టం కలిసి రాలేదని కొంతమంది స్టూడెంట్స్ పక్కదారి పడుతుంటారు. అవకాశం లేకపోయినా అదృష్టం దరిదాపులలో కనిపించక పోయినా మరికొంతమంది అనుకున్నది సాధిస్తారు. అలాంటి రెండు పాత్రల చుట్టూ తిరిగే ఈ కథ ఎమోషనల్ గా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. బలమైన కథాకథనాలతో బలమైన పాత్రలతో నడిచే ఈ సిరీస్, ప్రతి ఒక్కరూ చూసితీరవలసిన సిరీస్ అని చెప్పచ్చు.

# భాగ్య శ్రీ బోర్సే గురించి అలాగే అనుకుంటున్నారు మరి!



భాగ్యశ్రీ బోర్సే .. పాల సరస్సులో పూసిన తెల్లకలువలాంటి అందం. అమరశిల్పి జక్కన ఊహకి కూడా అందని శిల్పం. మబ్బులను .. మెరుపులను కలిపి చేసినట్టుగా కనిపించే రూపం. చోళులు .. చాళుక్యుల కాలం నాటి శిల్పాల వరుసలో తప్ప, ఈ మధ్య కాలంలో ఎవరూ ఎక్కడా చూడని ఒక లావణ్య విశేషం. విశాలమైన కళ్లతో విన్యాసాలు చేస్తూ ఆమె యూత్ హృదయాలను కొల్లగొట్టేస్తోంది. అలాంటి భాగ్యశ్రీ బోర్సే గురించి మాట్లాడుకోని కుర్రాళ్లు ఉండరనే చెప్పాలి. తెరపై భాగ్యశ్రీని చూసిన కుర్రాళ్లంతా ఈ అమ్మాయికి నటన తెలియక పోయినా ఫరవాలేదు. అలా తెరపై కనిపిస్తూ ఉంటే చాలానే అనుకుంటారు. అందువల్లనే పెద్దగా సక్సెస్‌లు లేకపోయినా, అవకాశాలు మాత్రం వెతుక్కుంటూనే వస్తున్నాయి. వచ్చే నెల చివరి వారంలో ఈ సుందరి 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ జోడీగా ఆమె చేసిన ఈ సినిమా, భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే ఒక టాక్ బలంగానే వినిపిస్తోంది. అయితే ఇక్కడ మరో విశేషం ఏమిటంటే, 'పెద్ది' సినిమాలో భాగ్యశ్రీ కూడా మెరిసి ఉంటే బాగుండేదనే ఒక టాక్ ఇప్పుడు షికారు చేస్తోంది. 'పెద్ది'లో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా, ఐటమ్ సాంగ్ లో శృతిహాసన్ సందడి చేయనుంది. మార్కెటింగ్ పరంగా చూసుకుంటే, మేకర్స్ నిర్ణయం సరైనదే అయినా, గ్లామర్ పరంగా చూసుకుంటే, భాగ్యశ్రీ కూడా ఎక్కడో ఒక చోట మెరిసే ఛాన్స్ ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చరణ్ తరువాత సినిమాలోనైనా ఈ బ్యూటీకి ఛాన్స్ దొరుకుతుందేమో చూడాలి మరి.

# 'పెద్ది' పైరసీ బారినపడకుండా మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులు




రామ్ చరణ్ హీరోగా వచ్చే నెలలో విడుదలవుతున్న 'పెద్ది' చిత్రం ఆన్‌లైన్ పైరసీకి అడ్డుకట్ట వేయడానికి మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్నెట్‌లో ఈ చిత్రాన్ని చట్టవిరుద్ధంగా అప్‌లోడ్ చేయకూడదని, కాపీ చేయకూడదని, ప్రసారం చేయకూడదని, విడుదల చేయకూడదంటూ కోర్టు పైరసీ నిరోధక ఉత్తర్వులను జారీ చేసింది. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. సినిమా అనధికారికంగా ఇంటర్నెట్ ద్వారా లీక్ అయితే నిర్మాతలకు భారీ నష్టం వాటిల్లుతుందని కోర్టు పేర్కొంది. అందుకే ఈ సినిమాకు యాంటీ పైరసీ ఇంజంక్షన్ జారీ చేసినట్లు తెలిపింది.

### ఏమిటీ యాంటీ పైరసీ ఇంజంక్షన్?

కాపీరైట్ హక్కుదారులు తమ సినిమా లేదా వెబ్ సిరీస్ కంటెంట్‌లు అక్రమంగా కాపీకాకుండా, పైరసీ వెబ్ సైట్లలో ప్రసారం కాకుండా కోర్టుల ద్వారా పొందే ఒక న్యాయపరమైన రక్షణ ఉత్తర్వు ఈ యాంటీ పైరసీ ఇంజంక్షన్. ఒక వెబ్ సైట్‌ను బ్లాక్ చేసిన వెంటనే కొత్త యూఆర్‌ఎల్‌తో అదే కంటెంట్ రాకుండా కొత్త సైట్‌లను కూడా ఆటోమేటిక్‌గా బ్లాక్ చేయడానికి ఈ డైనమిక్ ఇంజంక్షన్ ఉత్తర్వులను కోర్టులు జారీ చేస్తుంటాయి.

# 'డెర్బీ' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!




కాలేజ్ నేపథ్యంలోని కథలు యూత్ ను విశేషంగా ఆకట్టుకుంటూ ఉంటాయి. క్యాంపస్ కథలతో వచ్చిన చాలా సినిమాలు విజయాలను సాధించాయి. అలాంటి ఒక నేపథ్యంలో వచ్చిన సినిమానే 'డెర్బీ'. మార్చి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీలోకి అడుగుపెట్టింది. ఈ నెల 15వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో పాటు తెలుగులోను ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. అర్జున్ .. సందీప్ .. ష్వాన్ .. ఉస్తాద్ .. యూసఫ్ .. మరియా స్నేహితులుగా ఉంటారు. అందరూ కూడా ఒకే కాలేజ్ లో చేరతారు. అర్జున్ తల్లి విదేశాలలో ఉంటుంది. అందువలన అర్జున్ కి సంబంధించిన అన్ని విషయాలను తండ్రి దినకరన్ చూసుకుంటూ ఉంటాడు. ఇక యూసఫ్ విషయానికి వస్తే, తండ్రి లేని యూసఫ్ ను ఫారిన్ లో ఉంటున్న మేనమామ దగ్గరికి పంపించాలనే ఉద్దేశంతో తల్లి ఉంటుంది. ఇక మిగతా స్నేహితులంతా కూడా మధ్యతరగతి నుంచి వచ్చినవారే. కాలేజ్ లైఫ్ ను కలర్ఫుల్ గా గడపొచ్చు .. ఎంజాయ్ చేయవచ్చని భావించిన అర్జున్ టీమ్ కి, తొలిరోజునే నిరాశ ఎదురవుతుంది. కాలేజ్ లో థర్డ్ ఇయర్ గ్యాంగ్ కి లీడర్ గా 'రియాజ్' ఉంటాడు. సెకండియర్ గ్యాంగ్ కి 'అమల్' నాయకుడిగా ఉంటాడు. ఈ రెండు గ్రూపుల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉంటాయి. ఫ్రెషర్స్ గా వచ్చిన అర్జున్ బ్యాచ్ వాళ్లు సీనియర్స్ ను చూసి కంగారు పడిపోతారు. కాలేజ్ లో తాము అనుకున్నట్టుగా రోజులు గడవడం కష్టమేనని వాళ్లకి అర్థమైపోతుంది. ఫస్టు ఇయర్ వాళ్లను సీనియర్స్ ప్రతి విషయంలో ఎవైడ్ చేస్తుంటారు. క్లాస్ రూమ్స్ .. క్యాంపస్ .. క్యాంటీన్ .. ప్లే గ్రౌండ్ .. ఇలా అన్ని చోట్లా ఫస్టు ఇయర్ వాళ్లను అవమానించడమే పనిగా పెట్టుకుంటారు. సీనియర్ అయిన శ్రేయతో అర్జున్ చనువుగా ఉండటం, వాళ్ల ఆగ్రహానికి మరింత కారణమవుతుంది. అప్పుడు అమల్ గ్యాంగ్ ఏం చేస్తుంది? వాళ్లను అర్జున్ టీమ్ ఎలా ఎదుర్కొంటుంది? కాలేజ్ క్యాంపస్ వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ. కాలేజ్ లో తమ పిల్లలు బాగా చదువుకోవాలనీ, కాలేజ్ నుంచి బయటికి రాగానే మంచి జాబ్ సంపాదించి లైఫ్ లో సెటిల్ కావాలని పేరెంట్స్ ఆశపడుతూ ఉంటారు. కాలేజ్ లో ఎలాంటి గొడవలు లేకుండా తమ పిల్లలు బయటపడాలని భావిస్తూ ఉంటారు. అయితే అందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతూ ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచో చదువుకోవడానికి వచ్చిన స్టూడెంట్స్ మధ్య ఇక్కడ ఎలాంటి వార్ నడుస్తూ ఉంటుందనే అంశం చుట్టూ ఈ కథను అల్లుకున్నారు. కాలేజ్ లలో సీనియర్స్ .. జూనియర్స్ మధ్య సంబంధాలు ఎలా ఉంటాయి. ర్యాగింగ్ అనేది వాళ్లను ఎలా విడదీస్తుంది. సీనియర్స్ ను యాజమాన్యం ఎందుకు నియంత్రించలేకపోతోంది అనే విషయాలను టచ్ చేస్తూ దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. ఆవేశాల కారణంగా స్టూడెంట్స్ భవిష్యత్తు ఎలా ప్రశ్నార్థకంగా మారుతుందనేది ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. అలాగే స్టూడెంట్స్ కుటుంబాల వైపు నుంచి ఎమోషన్స్ ను కనెక్ట్ చేయడానికి ట్రై చేయడం కనిపిస్తుంది. కాలేజ్ వాతావరణం ఎలా ఉంటుంది .. ఆ క్యాంపస్ లోకి అడుగుపెట్టిన తరువాత స్టూడెంట్స్ ప్రవర్తన ఎలా ఉంటుందనేది సహజంగా ఆవిష్కరించడంలో దర్శకుడు కొంతవరకూ సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. లవ్ .. ఫ్రెండ్షిప్ .. కామెడీ .. ఫ్యామిలీ ఎమోషన్స్ లో, కేవలం ఫ్రెండ్షిప్ ను మాత్రమే కాస్త హైలైట్ చేయడం కనిపిస్తుంది. మిగతా అంశాలు అంతగా ప్రభావితం చేయకపోవడం నిరాశను కలిగిస్తుంది. కాలేజ్ కథల్లో లవ్ .. రొమాన్స్ అనే అంశాలాను టచ్ చేయకుండా వదలరు. యూత్ లో ఎక్కువగా ఆ అంశాలపై ఫోకస్ చేస్తూనే థియేటర్స్ కి వస్తారు. అయితే ఈ సినిమా విషయంలో ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. స్టూడెంట్స్ గొడవలు .. కొట్లాటలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. ఆ గొడవల వెనుక బలమైన ఎమోషన్ లేకపోవడం మరో మైనస్ గా అనిపిస్తుంది. కథ ఒక ఫ్లోలో పరిగెత్తకుండా ఎటెటో వెళుతుంది. అనవసరమైన సన్నివేశాల దిశగా మలుపులు తీసుకుంటుంది. కాలేజ్ క్యాంపస్ లోకి వెహికల్స్ ను అనుమతించమని అంటే, హెలికాప్టర్ లో రావడం వంటి సన్నివేశాలు కాస్త అతిగా అనిపిస్తాయి. అమల్ గ్యాంగ్ అరాచకం చాలదన్నట్టుగా, హకీమ్ గ్యాంగ్ ను రంగంలోకి దింపడం కూడా అలాంటిదే. స్టూడెంట్స్ గా చేసిన వాళ్లంతా బాగానే చేశారు. కాకపోతే ఎమోషన్స్ వైపు నుంచి వాళ్ల పాత్రలను ఎక్కువగా డిజైన్ చేయకపోవడం నిరాశను కలిగిస్తుంది. కథాకథనాలు కొత్తగా .. గొప్పగా అనిపించవు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం . ఎడిటింగ్ ఓ మాదిరిగా ఉన్నాయంతే. యూత్ ను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన కంటెంట్ అయినప్పటికీ, యూత్ ను ఆకట్టుకోలేకపోయిందనే చెప్పాలి.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449